RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 07 నవంబర్ 2025 శుక్రవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:133

# కేటీఆర్‌ను అరెస్టు చేద్దామంటే

## గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేద్దామంటే గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా అవినీతి మయమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ వేయాలని నిర్ణయం తీసుకుని..దీనిని సీబీఐకి కూడా అప్పగించామన్నారు. కానీ, మూడు మాసాలైనా ఇప్పటి వరకు సీబీఐ రంగంలోకి దిగలేదని తెలిపారు. ఈ పరిణామాలను చూస్తే బీఆర్ఎస్‌ను బీజేపీ కాపాడుతోందన్న విషయం స్పష్టంగా తెలుస్తోందని ఆరోపించారు. బీజేపీ, కారు పార్టీల మధ్య సమన్వయం సంబంధం లేకపోతే, ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు.త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుందని మరోసంచలన వ్యాఖ్య చేసిన సీఎం రేవంత్ రెడ్డి.ఈ విషయాన్ని గతంలో అదే పార్టీకి చెందిన కవిత కూడా చెప్పారన్నారు. విలీన ప్రక్రియ ప్రతిపాదనను తానే అడ్డుకున్నట్టు ఆమె చెప్పిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో ఇరు పార్టీలు కలిసి..ప్రయోగం చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా.. జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని సీఎం చెప్పారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటున్నారని తెలిపారు.మైనారిటీలు, క్రిస్టియన్ వర్గాలు కూడా తమకే అనుకూలంగా ఉన్నారని రేవంత్ రెడ్డి చెప్పారు. భారత్ జోడో యాత్ర చేపట్టిన



రాహుల్ గాంధీ మైనారిటీలకు అండగా ఉన్నారని తెలిపారు. వారంతా కాంగ్రెస్‌తోనే ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా క్రిస్టియన్లు కూడా తమతోనే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వారి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చినట్టు తెలిపారు. బీఆర్ ఎస్-బీజేపీలు ఆడుతున్న నాటకాలను, కలసి చేస్తున్న విన్యాసాలను ప్రజలు గమనిస్తున్నారన్న రేవంత్ రెడ్డి. త్వరలో జరగనున్న పోలింగ్‌లో ఇరు పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు.కిషన్ రెడ్డి మరోమాట:మరోవైపు బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాత్రం దీనికి భిన్నంగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కవల పిల్లలని..అవి రెండూ కలిసే పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బీజేపీకి-బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నా రు. పైగా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, కేసీఆర్ మంత్రిగా పనిచేశారని తెలంగాణ వచ్చాక కుటుంబంతో సహా కలిసి వెళ్లి సోనియాగాంధీని ప్రశంసించారని గుర్తు చేశారు. కాబట్టి కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల మధ్యే అవగాహనా ఒప్పందం ఉంటుందని వ్యాఖ్యానించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన రామోజీ గ్రూప్స్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. కిరణ్. ఈ నెల 16 న 'రామోజీ గ్రూప్ ఫౌండేషన్ డే' వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన "రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల" ప్రదానోత్సవ కార్యక్రమానికి సీఎంను ఆహ్వానించిన కిరణ్.

# వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం

యాసంగి సీజన్ కి సంబంధించిన ఎరువుల సరఫరాలపై రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులతో ఈ రోజు మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గోపి గారు మాట్లాడుతూ.. యాసంగి సీజన్ కోసం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 1.45 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, 7 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.65 లక్షల మెట్రిక్ టన్నులు ఎమ్ఓపి, 0.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్పి ఎరువులను రాష్ట్రానికి కేటాయించడం జరిగిందని అన్నారు. గౌరవ మంత్రి వర్యుల ఆదేశాలతో రాష్ట్రానికి కేటాయించిన 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో 6 లక్షల మెట్రిక్ టన్నులను అక్టోబర్, నవంబర్ మరియు డిసెంబర్ నెలలలో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేయాల్సిందిగా కోరడం జరిగిందని, దానికి తగ్గట్లుగా నిరంతరము సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ రాష్ట్రానికి రావాల్సిన ఎరువులను ముందుగానే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రివర్యుల దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ.. గత సీజన్ లో కేంద్ర ప్రభుత్వాన్ని సీజన్ ప్రారంభం కాకముందే అడిగినా ఎరువులు కేటాయించిన ప్రకారం సరఫరా చేయలేదని గుర్తుచేశారు. ఈ సీజన్ లో అయినా కేంద్రం కేటాయించిన ఎరువులను 60 నుంచి 70 శాతం మేర అక్టోబర్, నవంబర్ మరియు డిసెంబర్ లలో సరఫరా చేసినట్లయితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయవచ్చనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేటాయించిన ఎరువులలో 70 శాతం వరకు ముందస్తుగా తెప్పించుకున్నట్టయితే, తరువాత నిరంతరం వచ్చే ఎరువులతో కలిపి రైతులకు అవసరమున్నంత మేరకు, ఏదైతే గత యాసంగి, అంతకుముందు వానాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయగలిగామో అలానే ఈ యాసంగిలో



కూడా చేయవచ్చని అధికారులకు సూచించారు. కేంద్రం ప్రభుత్వము అక్టోబర్ మరియు నవంబర్ నెలలకు రాష్ట్ర ప్రభుత్వము కోరినట్లుగా నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియా కేటాయించిందని, అయితే గత నెలలో ఇంకా 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఓడరేవుల నుండి రాష్ట్రానికి చేరుకోవాల్సి ఉందని, ఈ నెలలో ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరుకున్నట్లు, దీంతో 1.88 లక్షల మెట్రిక్ టన్నులు అక్టోబర్ నుండి ఇప్పటివరకు సరఫరా అయినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.43 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 58 వేట టన్నుల డిఎపి, 2.09 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఈ బఫర్ నిల్వలు రానున్న రోజుల్లో మరింతగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రైల్వే శాఖ వారు వరంగల్ రేక్ పాయింట్ ను మూసివేసిgoods handlings ను చింతలపల్లి పాయింట్ కు మార్చాలని నిర్ణయించడం జరిగిందని, ఇలా ఒక్కసారిగా వరంగల్ రేక్ పాయింట్ ను మూసివేయడం వలన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని, కావున 4 నుండి 5 నెలల పాటు అది పూర్తి స్థాయిలో వాడకంలో వచ్చేదాకా వరంగల్ రేక్ పాయింట్ ను కొనసాగించాలని రైల్వే మంత్రి గారిని లేఖ ద్వారా అభ్యర్థించారు.

మరోవైపు నవంబర్ నెల యూరియా సరఫరా ప్రణాళిక ప్రకారం రాష్ట్రానికి 2.00 లక్షల మెట్రిక్ టన్నులను కేంద్ర ఎరువుల శాఖ కేటాయించగా, అందులో 1.29 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి యూరియా (CIL-1.02 LMT, IPL-0.27 LMT) కాగా, మిగతా 0.71 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయ వనరుల నుండి కేటాయించబడ్డాయి. అక్టోబర్ నెలకు సంబంధించి CIL, IPL కంపెనీల నుండి రాష్ట్రానికి రావాల్సిన దిగుమతి యూరియాలో 0.37 లోటు ఏర్పడిందని అన్నారు. రాష్ట్రంలో యూరియా వినియోగం ప్రధానంగా డిసెంబర్ మూడో వారం నుండి ఉంటుందని, ఆ సమయంలో మక్కజొన్న, వరి పంటలతో గరిష్ట స్థాయికి చేరుకుంటుందని, ఈ సమయాలలో ఎరువుల కొరత రాకుండా ఉండటానికి కేంద్రం వెంటనే 0.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి యూరియా కేటాయించడంతో పాటు, CIL ద్వారా త్వరితగతిన రవాణా చేయాలని కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రిగారిని కోరినట్లు తెలిపారు.

## ప్రైవేట్ లెక్చరర్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తా: మధుయాష్కి

వార్త 2 లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపెవరిదో సర్వేల్లో తేలడం లేదన్న కిషన్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 6జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై సర్వేల్లోనూ స్పష్టత రావడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనే విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తమ హామీల గురించి ప్రస్తావించడం లేదని, ఇచ్చిన గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. ఉచిత బస్సు పథకం గురించి మాట్లాడుతున్నారని, అన్ని సమస్యలకు అదే పరిష్కారమన్నట్లు వ్యవహరించడం వారి మూర్ఖత్వమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ఎక్కువ వాటా కేంద్రానిదేనని, ఆ పథకాన్ని ఆపేస్తామని సీఎం ఎలా అంటారని ప్రశ్నించారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనుకబాటుకు గతంలో పాలించిన బీఆర్ఎస్ పార్టీ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో ఉండే కనీస అభివృద్ధి కూడా ఇక్కడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా నిధులు లేవని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైందని గుర్తుచేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై నమ్మకం లేకపోవడంతో జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోలేకపోతున్నారని, ఈ గందరగోళం సర్వేల్లోనూ ప్రతిబింబిస్తోందని ఆయన విశ్లేషించారు.

# టీవీ సీరియల్స్ ఫెడరేషన్ సభ్యులతో సమావేశం అయిన మంత్రి పొన్నం ప్రభాకర్





యూసుఫగూడ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా టీవీ సీరియల్స్ ఫెడరేషన్ సభ్యులతో సమావేశం అయిన మంత్రి పొన్నం ప్రభాకర్ , చిన్న శ్రీశైలం యాదవ్ , నటుడు సుమన్ మరియు ఇతర ముఖ్య నేతలు

టీవీ సీరియల్స్ సభ్యుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి

ఉప ఎన్నికల్లో తమ మద్దతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసిన టీవీ సీరియల్ ఫెడరేషన్

మంత్రి పొన్నం ప్రభాకర్

టివి సీరియల్ ఫెడరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది..వారికి ధన్యవాదాలు..

టివి ఇండస్ట్రీ సంక్షేమానికి సంబంధించి ముఖ్యమంత్రి గారితో మాట్లాడతాం..

స్థానిక శాసన సభ్యుడు పట్టించుకోని ఉంటే ఇంత ఇబ్బందులు ఉండేవి కావు..

ప్రభుత్వంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి గా మీ సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకుంటాం

మాది ప్రజా పాలన ప్రభుత్వం.. మేము చెప్పిందే వినాలని కాదు..మీరు చెప్పింది వింటాం..

దేశంలో చారిత్రాత్మక నిర్ణయం మార్పులు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకున్నాయి

టివి సీరియల్ ఇండస్ట్రీ ఐక్యంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతు తెలిపారు..

ప్రేక్షకునికి సౌలభ్యం అనుగుణంగా టెక్నాలజీ మారింది.. దానికి అనుగుణంగా మన వ్యవస్థ మారాలి

ఇండస్ట్రీస్ కి మరింత గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకుంటాం..

ప్రజాబలం

07 నవంబర్ 2025 శుక్రవారం

## కాంతిరేఖ మమ్దానీ

బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్ (నయ్యర్) పుత్రరత్నం న్యూయార్క్ మహానగరం మేయర్ అయ్యాడు. ముప్పైనాలుగేళ్ళ జోహ్రాన్ క్వామే మమ్దానీ నూటముప్పైయేళ్ళలో ఆ మహానగరం తొలిపౌరుడిగా ఎన్నికైన పిన్నవయస్కుడే కాదు, తొలి ముస్లిం, దక్షిణాసియామూలాలున్న తొలివ్యక్తి కూడా. మమ్దానీ తన విజయోత్సవ ప్రసంగంలో మార్పు మొదలైందని గర్జించాడు. తదనుగుణంగా జవాహర్‌లాల్ నెహ్రూ చరిత్రాత్మక 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' నుంచి కొన్ని వాక్యాలను ఉటంకించాడు. రెండు చేతులా నమస్కరిస్తూ వేదికమీదకు చీరకట్టులో వచ్చిన పంజాబీ తల్లినీ, గుజరాతీ మూలాలున్న తండ్రినీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాడు. పాత వదిలి కొత్తలోకి అడుగుపెడుతున్న ఈ ఘట్టాన్ని ట్రంప్ వింటున్నారు, కంటున్నారంటూ హెచ్చరికలు చేసిన మమ్దానీ, తన విజయదుందుభి ట్రంప్ చెవుల్లో మారుమోగాలని కాబోలు, బాలీవుడ్ గీతం 'ధూమ్ మచాలే'ని ఈ వేడుకకు నేపథ్యగీతం చేశాడు. మిగతా ప్రపంచాన్ని పలు రకాలుగా బెదిరిస్తూ, వీరంగాలు వేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు జోహ్రాన్ మమ్దానీ విజయం నైతికంగా పెద్ద ఎదురుదెబ్బ, రాజకీయంగా ఘాటైన హెచ్చరిక.

ట్రంప్ రెండోరాకడ తరువాత జరిగిన ఈ అతిపెద్ద ఎన్నికల ఫలితాలు డెమెక్రాట్లకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయి. న్యూయార్క్‌ను మమ్దానీ గెలుచుకోవడంతో పాటు, న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్లుగా డెమోక్రటిక్ పార్టీకి చెందినవారే గెలవడం విశేషం. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా హైదరాబాద్‌లో జన్మించిన గజాలా హష్మీ చక్కని మెజారిటీతో ఎన్నికైనారు. భారతీయ సంతతికి చెందిన అఫ్తాబ్ పూరేవాల్ అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ సోదరుడిని ఓడించి, సిన్సినాటి మేయర్‌గా మారోమారు విజయం సాధించడం విశేషమైన పరిణామం. ట్రంప్ పార్టీ, ఆయన బృందం, మతవాదులూ మితవాదులు కలసికట్టుగా ముస్లిం వ్యతిరేకతను ఎంతగా రేపినప్పటికీ మమ్దానీ, హష్మీల విజయం ఓటర్ల రాజకీయ పరిణతికీ, మతసహనానికీ నిదర్శనం. మమ్దానీకి యూదులు అత్యధికంగా ఓటుచేశారన్న విశ్లేషణలు మరింత ఆశ్చర్యం కలిగిస్తాయి. గాజా ఊచకోతలను ఘాటుగా విమర్శిస్తూ, నెతాన్యాహూను చీల్చిచెండాడంలో మమ్దానీ ఎన్నడూ ఏ మాత్రం తగ్గలేదు. యూదువ్యతిరేకిగా మమ్దానీని ఎంతగా చిత్రీకరించినా, అతడికి ఓటుచేయడంలో యూదులు ముందంజలో ఉన్నందుకు ట్రంప్ ఇప్పుడు వారిని తిట్టిపోస్తున్నారు. ఆఫ్రో అమెరికన్లు, ఆసియన్లు సహా ఇతర శ్వేతజాతేతరుల ఓట్లు మమ్దానీకి అధికంగా పడతాయన్నది ఊహించిందే.

డెమోక్రాటిక్ పార్టీ తరఫున నగర మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండుమందిని వెనక్కునెట్టి జూన్ 24న మమ్దానీ ఎన్నికకావడం మిగతా ప్రపంచాన్ని ఆకర్షించింది, ట్రంప్‌ను భయపెట్టింది. అతని విజయం ఖాయమని అర్థం అవుతున్నకొద్దీ ట్రంప్ దాడిహెచ్చింది, దూకుడు పెరిగింది. ఓటర్లకు మమ్దానీ మత, సైద్ధాంతిక మూలాలను ట్రంప్ పదేపదే గుర్తుచేస్తూ, ఈ కమ్యూనిస్టు ఏలుబడిలో నగరం నాశనమైపోతుందని హెచ్చరించారు. వెయ్యేళ్ళ విఫలకమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకితెచ్చి ఆర్థికంగా, సామాజికంగా నగరాన్ని భ్రష్టుపట్టిస్తాడన్నారు. మమ్దానీని ఎన్నుకుంటే నిధులివ్వకుండా నగరాన్ని నిలువునా మాడ్చేస్తానని కూడా పౌరులను ట్రంప్ బెదిరించారు. డెమోక్రాట్ బెర్నీ శాండర్స్ బాటలో తనను సోషలిస్టుగా ప్రకటించుకున్న మమ్దానీ కనుక గెలిస్తే తమ పెట్టుబడిదారీ సమాజం మీద ఆ ప్రభావం అధికంగా ఉంటుందని ట్రంప్ భయం. పునాదిలోనే దానిని చిదిమేయడానికి తన పార్టీని ఈ ఎన్నికల్లో పోటీచేయనివ్వకుండా, డెమోక్రాటిక్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆండ్రూ కుమోకు మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్టు కంటే ఒక చెత్త డెమోక్రాట్ ఉత్తమమంటూ తన ఓటర్లను సైతం అటు మళ్ళించాడు. డెమోక్రాటిక్ పార్టీ ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్ కూడా కుమోకు మద్దతు ఇచ్చారు. ఇలా రెండుపార్టీలనుంచీ మమ్దానీని బలహీనపరిచే ప్రయత్నాలు బలంగా సాగాయి. మతఛాందసులు, పార్టీలకు అతీతంగా ఒక్కటైన పెట్టుబడిదారులు, ఆయన మతాన్నే కాదు, ఆహారపు అలవాట్లను సైతం ఎగతాళి చేస్తూ విషం చిమ్మిన ట్రంప్ అనుకూల మీడియా ఎంత ప్రయత్నించినా, సామాన్యులు, కార్మికులు మమ్దానీ పక్షాన నిలిచి గెలిపించారు. డెమోక్రాటిక్ పార్టీ భవిష్యత్తును నిర్ణయించేది దాని నాయకత్వం కాదు, కార్మికవర్గమేనని బెర్నీశాండర్స్ మరోమారు గుర్తుచేస్తున్నారు. తన విజయాన్ని కారు చీకటిలో కాంతిరేఖగా మమ్దానీ అభివర్ణించడం సముచితం. రెండుపార్టీల మధ్యా పెద్ద తేడాలేకుండా ఘనీభవించిపోయిన అమెరికాలో సామాన్యుల సంక్షేమానికీ, శ్రేయస్సుకూ హామీపడుతున్న ఎజెండాతో కొత్త రాజకీయానికి మమ్దానీ తెరదీశారని అనేకుల ఆశ. ఇస్లామోఫోబియా హెచ్చుతూ, వలసదారులను తరిమేస్తున్న రాజ్యంలో ఒక ముస్లిం, అదీ వలసదారుల సంతానం విజయం సాధించినందుకు సంతోషించవలసిందే.

# జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే... ఆందోళన బాట తప్పదు

### –టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్పష్టం







గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన బాట తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) స్పష్టం చేసింది.

లి గురువారం నాడు శంకర్ పల్లి మండలంలోని పొద్దటూరులో ప్రగతి రిసార్ట్స్ లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో, జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం నుండి జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించక పోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. గత ప్రభుత్వం ఇలాంటి వైఖరినే అనుసరిస్తే గల్లీ నుండి ఢిల్లీ దాక తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వీలైనంత తొందరలో పరిష్కరించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.లి ఈ అంశంపై ఐజేయు జాతీయ అధ్యక్షులు, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్చించినట్లు ఆయన స్పష్టం చేసారు.

లి ఫిబ్రవరి మాసం మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) జాతీయ ప్లీనరీని విజయవంతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమైనట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అయితే ఈ ప్లీనరీ సందర్భంలో జనవరి మాసంలో రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించేందుకు సమావేశం నిర్ణయించింది. మహాసభలు పెండింగులో ఉన్న జిల్లాల్లో జనవరి మొదటి వారంలోపు వాటిని పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది.

యూనియన్ నియమించిన ఆయా సబ్ కమిటీల సమావేశాలను త్వరలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ కు మద్దతు పలికి, ప్యానెల్ గెలుపు కోసం శ్రమించిన రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీతో పాటు ఇతర నాయకులను కార్యవర్గం అభినందించింది. అలాగే ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. గత కార్యవర్గ సమావేశం తర్వాత యూనియన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ నివేదిక సమర్పించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో అకాల మరణం చెందిన 16మంది జర్నలిస్టులకు సమావేశం నివాళి అర్పిస్తూ, సంతాప సూచికగా మౌనం పాటించింది. రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా శాఖను సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో ఐజేయు జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. సంపత్ కుమార్, గాడిపల్లి మధు గౌడ్, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 30 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ లెక్చరర్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తా: మధుయాష్కి

### ప్రైవేట్ లెక్చరర్ ఫోరమ్ ఆధ్వర్యంలో సమావేశం, గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మధుయాష్కీగౌడ్

### కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరిన మధుయాష్కి గౌడ్





రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్స్ లాంటి ఎన్నో సంఘాల కృషి, భాగస్వామ్యం ఉందని.. వారందరూ ఇప్పుడు కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా నిలబడి పనిచేయాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు కోరారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ లో ప్రైవేటు లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో అన్ని రంగాలు ధ్వంసం అయ్యాయని, ఫీజు రియంబర్స్ బకాయిలు రూ. 3000 కోట్ల పైన బకాయిలు పెట్టారన్నారు. లెక్చరర్స్ కి కేవలం 10 నెలల జీతాలు మాత్రమే ఇవ్వడం దారుణమని, అది కూడా చాలీచాలని జీతాలు ఇవ్వడం బాధాకరమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు దోపిడీ లక్ష్యంగా పనిచేస్తున్నాయని.. తెలంగాణ వస్తే ఆ సంస్థలు మూతపడతాయి అనుకుంటే.. గత బీఆర్ ఎస్ పాలన్లో మరింత విస్తరించాయన్నారు. తెలంగాణ వాసులు ఏర్పాటు చేసుకున్న చిన్న కళాశాలల పరిస్థితి మరింత దిగజారిందన్నారు. ప్రైవేటు లెక్చరర్ల సమస్యలు సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది అని, జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని.. సమస్యలన్నీ వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అంతకుముందు మధురానగర్ లో జరిగిన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్నారు. నవీన్ యాదవ్ గెలుపు ద్వారా బడుగు వర్గాల చెందిన వ్యక్తికి చట్టసభల్లో ప్రాతినిధ్యం బలపడుతుందని.. అందరు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు కత్తి వెంకటస్వామి గారు, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లో స్పందన బలం తగ్గిపోవడం తో ఫేక్ సర్వేలు చేపిస్తున్నారు

### బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీ

బోగస్ సంస్థలకు డబ్బులు ఇచ్చి ఫేక్ సర్వేలతో కేడీ %ఒ% కంపెనీ ఎన్నికలు ప్రచార సభలు లో వాడుకుంటున్నారు

గత 10 ఏళ్ళు లో తెలంగాణ ను దోచుకున్న బిఆర్ఎస్ పార్టీ.

జూబ్లీహిల్స్ కు పదేళ్లు బిఆర్ఎస్ పాలనలో ఎన్ని కోట్లు నిధులు ఇచ్చారు , అభివృద్ధి ఏమి చేశారో బిఆర్ఎస్ పార్టీ బహిరంగ చర్చ కు రావాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండు ఏళ్లలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చుము.

కేటీర్ మున్సిపల్ శాఖ మంత్రి గా ఉన్నప్పుడు జూబ్లీహిల్స్ నియోజకవర్గం కు ఏ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలి.

10 ఏళ్ళు అధికారం లో బిఆర్ఎస్ పార్టీ చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించలేదు మాగంటి గోపీనాథ్ గారి మరణం తరువాత అసెంబ్లీ లో సంతాపం తెలిపితే కేటీర్ ఆ సభ హాజరు కాలేదు.

నేడుమీ కుటుంబ లబ్దికోసం మాగంటి గోపీనాథ్ గారి సతీమణి గారిని ఇబ్బందులు పెడుతున్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 30,000 మెజార్టీ తో విజయ ఢంకా మోగించబోతున్నారు.




బిఆర్ఎస్, బిజెపి రెండు దొంగ పార్టీలు వారిని నమ్మొద్దు.

పదేళ్లలో బిఆర్ఎస్ పార్టీ చెయ్యని అభివృద్ధిని నేడు వాటినే సమస్యలుగా చూపిస్తున్నారు.

# అమరావతి చుట్టూ ఓఆర్ఆర్

రాజమండ్రి, నవంబర్ 6 అమరావతి రాజధాని లో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. అందుకు సంబంధించి కీలక అప్డేట్ ఒకటి వచ్చింది. అమరావతికి మణిహారంగా నిలవనున్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఎందుకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియలో కదలిక వచ్చింది. 11 మండలాల్లోని 40 గ్రామాల్లో భూసేకరణకు కసరత్తు ప్రారంభం అయింది. ఈ భూ సేకరణ ప్రక్రియను పర్యవేక్షించే ప్రత్యేక అధికారిగా శ్రీవాత్సవ నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. భూ సేకరణకు సంబంధించిన అంశాలపై ఫోకస్ చేశారు. దాదాపు 12 ప్యాకేజీలుగా విభజించి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. మొత్తం ఐదు జిల్లాల్లో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కోసం భూ సేకరణ చేపట్టనున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మాదిరిగా దీనిని నిర్మించనున్నారు. 11 మండలాలలోని 40 గ్రామాల్లో ఔటర్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ చేపట్టాల్సి ఉంది. దాదాపు 4792 ఎకరాలను సమీకరించనున్నారు. ప్రధానంగా దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి, గుంటూరు తూర్పు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, గుంటూరు పశ్చిమ, తాడికొండ, మేడికొండూరు, మంగళగిరి, పెదకాకాని మండలాల్లో భూ సేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే అన్ని మండలాల రెవెన్యూ అధికారులకు షెడ్యూల్ ఇచ్చారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు నేషనల్ హైవే అధికారులతో కలిసి ఏడు మండలాల్లో పర్యటన పూర్తి చేశారు. అమరావతి రాజధాని చుట్టూ 190 కిలోమీటర్ల పొడవుతో అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించాలన్నది ప్రణాళిక. ఈ ప్రాజెక్టు కోసం జాతీయ రహదారుల సంస్థ డిపిఆర్ సిద్ధం చేసింది. ఢిల్లీలోని జాతీయ రహదారుల సమస్త ప్రధాన కార్యాలయానికి పంపింది. దాదాపు 25 వేల కోట్ల రూపాయలతో ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయాలన్నది ప్రణాళిక. హైదరాబాద్కు మణిహారంగా నిలిచే ఔటర్ రింగ్ రోడ్డు పొడవు 158 కిలోమీటర్లు. అంటే అమరావతి రాజధాని లో 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే.. అమరావతికి ఇది మణిహారంగా మారనుంది. 140 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ జరగనుంది. ఐదు జిల్లాల్లో జరిగే భూ సేకరణ కోసం ఒక్కో జిల్లాకు ఒక్కో జాయింట్ కలెక్టర్ ను నియమించింది. త్వరలో భూ సమీకరణ ప్రారంభం కానుంది.

# రాజకీయాలకు పురందరేశ్వరి గుడ్ బై



రాజమండ్రి, నవంబర్ 6, రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరి సంచలన నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. రాజకీయాల నుంచి వైదొలగాలని భావిస్తున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమారుడు హితేశ్ చెంచురామ్ వచ్చే ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించినట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల కాలంలో నారా చంద్రబాబు నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబాల మధ్య సయోధ్య నెలకొనడంతో వచ్చే ఎన్నికల్లో ఆయనను పోటీకి దింపాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారు. ఆయన పుస్తకాలు రాసుకుంటూ, మనవళ్లతో గడుపుతూ కాలక్షేపం చేస్తున్నారు. రాజకీయాల్లోకి తన కుమారుడు హితేశ్ చెంచురామ్ ను ఎప్పటి నుంచో రాజకీయాల్లోకి తీసుకురావాలని భావించినా కొన్ని అడ్డంకుల కారణంగా అది సాధ్యం కాలేదు.. ఇప్పుడు దగ్గుబాటి పురంద్రీశ్వరి రాజకీయాల్లో ఉన్నారు. ఆమె రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు 1990వ దశకంలో రాష్ట్ర రాజకీయాలను శాసించిన నేత. ఆయన రాజకీయాలకు దూరం కావడంతో పాటు పురంద్రీశ్వరి కూడా అదే నిర్ణయానికి వచ్చేటట్లు కనపడుతుంది. ఆమె కేద్రమంత్రిగా పనిచేశారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యురాలిగా పనిచేశారు. ఆమె కూడా ఇక రాజకీయాల నుంచి రిటైర్ మెంట్ తీసుకుని కుమారుడు హితేశ్ చెంచురామ్ ను రాజకీయాల్లోకి తీసుకు వచ్చి తమ కుటుంబం నుంచి ఒకరు రాజకీయాల్లో కొనసాగేలా చూడాలన్నది కుటుంబ సభ్యుల నిర్ణయంగా కనిపిస్తుంది. అయితే దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ ను ఎక్కడి నుంచి పోటీ చేయించాలన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదంటున్నారు. 2019 ఎన్నికలకు ముందే దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ వైసీపీ లో చేరారు. అయితే నాడు ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆయన విదేశాల్లో ఎక్కువ కాలం ఉన్నందున కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినందున ఆయన స్థానంలో 2019 ఎన్నికల్లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే నాటి నుంచి ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇక పురంద్రీశ్వరికి కూడా కేంద్ర మంత్రి పదవి రాకపోవడంతో ఇక రాజకీయాలకు స్వస్తి చెప్పాలని భావిస్తున్నారట. అందుకే వచ్చే ఎన్నికల్లో దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ టీడీపీ నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని, ఇందుకు చంద్రబాబు కూడా ఓకే చెప్పినట్లు పార్టీ వర్గాల్లో నడుస్తుంది. దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ ను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయట.

# కావలిలో రెండు గ్రూపులు

నెల్లూరు నవంబర్ 6, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం మారలేదు. పార్టీ నేతలు కట్టుతప్పుతున్నా సరైన చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఈ ప్రభావం రాష్ట్రమంతటా కనపడుతుంది. కావలిలోనూ అక్కడి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి వ్యతిరేకంగా టీడీపీ నేతలు ఏకమయ్యారు. కావలిలో టీడీపీ నేత సుబ్బనాయుడు మృతి చెందడంతో ఈ వైషమ్యాలు ఎక్కువయ్యాయి. మాలేపాటి సుబ్బనాయుడు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు. ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ కూడా. అయితే కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి, మాలేపాటి సుబ్బనాయుడుకు మధ్య పడటం లేదు. రెండు గ్రూపులున్నాయి. ఈ నేపథ్యంలో నాయుడు మరణంతో ఆయన వర్గీయులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సభలను ఏర్పాటు చేసి నేరుగా ఆయనపై విమర్శలు చేశారు. మాలేపాటి సుబ్బనాయుడు అంత్యక్రియలకు కూడా కావ్య కృష్ణారెడ్డి హాజరు కాలేదు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే గ్రూపు తగాదాలు ఎక్కువయ్యాయి. మంత్రి నారాయణ కూడా రెండు వర్గాలకు సర్దిచెప్పలేకపోతున్నారు. ఎవరినీ వెనకేసుకు రాకుండా ఎవరివైపు నిలబడకుండా నారాయణ నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య విభేదాలకు చెక్ పెట్టాలని చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు. కావలిలో రెండు గ్రూపులకు చెక్ పెట్టాలని ఎంత ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వివాదానికి చెక్ పెట్టాలంటే స్వయంగా చంద్రబాబు కానీ, లోకేశ్ కాని రంగంలోకి దిగాల్సి ఉంటుంది. కానీ ఇద్దరికీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించే తీరిక లేదు. ఈ నెలలో విశాఖలో జరగనున్న పార్ట్నర్ షిప్ సమ్మిట్ పైనే ఇద్దరూ ప్రధానంగా దృష్టిపెట్టారు. ఇటీవల నెల్లూరు అర్బన్ డెవెలప్ మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కూడా మాఫియా డాన్ అంటూ జిల్లా నేతపై చేసిన ఆరోపణలను సీరియస్ గా తీసుకున్న అధినాయకత్వం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి అప్పగించింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గొట్టిపాటి ప్రసాద్, ప్రభాకర్ చౌదరి మధ్య కూడా ఇంకా ఉప్పు, నిప్పులానే ఉంది.

ఇక తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ల మధ్య రగడ కూడా చంద్రబాబు పట్టించుకోలేదు. తాను విదేశాల నుంచి వచ్చి ఇద్దరితో మాట్లాడతానని చెప్పిన చంద్రబాబు ఆ పంచాయతీని క్రమశిక్షణ సంఘానికి అప్పగించి వెళ్లారు. రేపు ఇరువురు నేతలు క్రమశిక్షణ సంఘం ఎదుట హాజరవుతారు.

అయితే గతంలోనూ కొలికపూడి శ్రీనివాసరావు అనేక సార్లు క్రమశిక్షణ సంఘం ఎదుట హాజరయ్యారని, ఏం జరిగిందని టీడీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు పార్టీ నేతల మధ్య విభేదాలపై దృ?ష్టి పెట్టకపోవడంతో అది అన్ని నియోజకవర్గాలకు అంటుకునేలా ఉందన్న ఆందోళన తెలుగు తమ్ముళ్లలో కనిపిస్తుంది.

## నత్తలొచ్చాయి..

కంటోన్మెంట్.. భాగ్యనగరంలో నత్తలు బెంబేలెత్తిస్తునాయి. ఆఫ్రికన్ నత్తల దాడికి ఎంతటి మహా వృక్షాలైన నేలకు ఒరగాల్సిందే.. శరవేగంగా విస్తరిస్తున్న ఈ నత్తల మూలంగా స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ న్యూ బోయిన్పల్లిలో మిలిటరీకి చెందిన మూడు ఎకరాల విస్తీర్ణంలోని పచ్చని వనంలో ఆఫ్రికన్ నత్తలు కనిపించడం ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇవి ఆకులు చిగుళ్ళు కాండం పూత పిందెలను కాకుండా ఏకంగా వృక్షాలే నేలకురిగేలా చేస్తాయని నిపుణులు అంటున్నారు. హైదరాబాద్ అంతట విస్తరిస్తే ఉన్న కొద్దిపాటి పార్కులు ఇండ్లలో పెంచుకునే ముక్కలు మిగలరని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేరళలో ఎక్కువగా కనిపించే ఈ నత్తలు బోయిన్పల్లిలో కనబడడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వీటి జీవితకాలం అయిదారేళ్ళ కాగా ఒక్కోటి నెలకు వందల సంఖ్యలో గుడ్లను పెట్టి విపరీతంగా సంతాన ఉత్పత్తి అభివృద్ధి చేస్తాయి. గతంలో ఆంధ్రప్రదేశ్లోని ఉపయోగపడే శ్రీకాకుళం జిల్లాలో రైతులను మిత్రులు లేకుండా చేసి బొప్పాయి ఆయిల్ ఫామ్ మిరప తదితర పంటలను పూర్తిగా నాశనం చేయడంతో అప్పట్లో నిపుణుల సూచనల మేరకు ఉప్పు ద్రావణం కాపర్ సల్ఫేట్, స్నెయిల్ కిల్లర్ మందు వాడే పిచికారి చేసి అదుపులోకి తెచ్చారు. వాతావరణం లోని తేమ ఎక్కువగా ఉండే చోట అభివృద్ధి చెందుతాయని ఆఫ్రికా నుంచి ఓడల ద్వారా వచ్చి ఉంటాయని నిపుణులు అంటున్నారు.పురుగుల మందుల ద్వారా నివారించవచ్చు అని పర్యావరణానికి ఇవి అత్యంత ప్రమాదకరమని అన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఉంటే వాటితో తగ్గిపోతాయని అన్నారు.

కంటోన్మెంట్ యంత్రాంగం వెంటనే స్పందించి చీడ నివారణకు రసాయనాలు ఉప్పు ద్రావణాలతో పిచికారి చేయించారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రహరీ గోడతో పాటు చెట్లకు పుట్టలపై పిచికారి చేయించి వాటిని సంహరించారు.

# పితానికి మంత్రి యోగం..

ఏలూరు, నవంబర్ 6, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తన కంటూ ఒక రోజు వస్తుందని బలంగా నమ్ముతున్నారు. తన ప్రధాన అనుచరులకు కూడా ఇదే చెబుతున్నారట. పితాని సత్యనారాయణ సీనియర్ నేతగా ఆయన పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక సామాజికవర్గానికి బలమైన నేత. ఆయన వెంటే లక్కు ఉంటుందని అందరూ భావిస్తారు. పార్టీ మారినా అధికారంలోకి రావడమే కాకుండా మంత్రి పదవి కూడా ఇంటికి వచ్చి తలుపుతడుతుందని ఆయన అనుచరులు భావిస్తారు. ఆయన ఉన్న పార్టీ అధికారంలోకి వస్తే చాలు తమ నేతకు మంత్రి పదవి గ్యారంటీ అని విశ్వసిస్తారు ఆయన అనుచరులు. బలమైన శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణకు ఈసారి మాత్రం మంత్రివర్గంలో స్థానం దక్కలేదు. పితాని సత్యనారాయణ కు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవి దక్కింది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చినా చంద్రబాబు పితానికి ఆలస్యంగానైనా మంత్రి పదవి ఇచ్చారు. బలమైన శెట్టి బలిజ సామాజిక వర్గం కావడం, ఆయన సామాజిక వర్గం ఐదారు శాసనసభ నియోజకవర్గాల్లో బలంగా ఉండటంతో ప్రతి పార్టీ ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ఎప్పుడూ జరుగుతుంది. పెనుగొండ, ఆచంట నుంచి నాలుగు సార్లు పితాని సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచారు. రెండుసార్లు మంత్రి పదవిని దక్కించుకున్నారు. శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణ కాంగ్రెస్, టీడీపీ హయాంలో ఒక వెలుగు వెలిగారు. ఆయన తొలుత వైసీపీలో చేరాలనుకుని 2014లో ఆయన టీడీపీలో చేరి తిరిగి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో జగన్ హవా ముందు ఆయన ఓటమి పాలయినా పార్టీలో ఉండి తిరిగి గెలుపొందారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఆచంట నియోజకవర్గం నుంచి పితాని సత్యనారాయణ గెలిచారు. ఇటు కూటమి కూడా అధికారంలోకి వచ్చింది. కానీ మంత్రి పదవి మాత్రం దక్కలేదు. ఆయన స్థానంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వాసంశెట్టి సుభాష్ కు మంత్రి పదవి దక్కింది. వాసంశెట్టి సుభాష్ కూడా శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందిన వారే. దీంతో పితాని సత్యనారాయణకు మంత్రి పదవి దక్కకుండా పోయింది. రామచంద్రాపురం నియోజకవర్గం నుంచి తొలిసారి గెలిచిన వాసంశెట్టి సుభాష్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని, తమ నేత పితాని సత్యనారాయణకు ఖచ్చితంగా విస్తరణలో కేబినెట్ లో చోటు దక్కుతుందని జోరుగా ప్రచారం చేస్తున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి. అయితే పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టున్న నేత పితానికి మంత్రి పదవి ఇస్తారా? వాసంశెట్టిని కొనసాగిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

# జనసేన ఎమ్మెల్యే పై కుట్ర జరుగుతుందా?

విజయనగరం, నవంబర్ 6, జనసేన ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి కూటమి పార్టీలోని నేతలకు అస్సలు పడటం లేదు. గత ఎన్నికల్లో అనూహ్యంగా విజయనగరం జిల్లా నెలిమర్ల నుంచి లోకం నాగ మాధవి జనసేన టిక్కెట్ తెచ్చుకున్నారు. కూటమి పార్టీల ఐక్యతతో మాధవి నెలిమర్ల నుంచి గెలుపొందారు. అయితే గెలిచిన నాటి నుంచి లోకం మాధవికి, నియోజకవర్గంలోని టీడీపీ నేతలకు మధ్య గ్యాప్ బాగా పెరిగింది. టీడీపీ నేతలను కేర్ చేయకపోవడంతో పాటు తనకు కావాల్సిన వారికే పనులు కట్టబెట్టడం వంటివి మాధవిపై టీడీపీ నేతలకు ఆగ్రహం కలిగించాయి. దీంతో గత కొంతకాలంగా సోషల్ మీడియాలో లోకం మాధవికి వ్యతిరేకంగా కూటమిలోని మిత్రులే పోస్టులు పెడుతున్నారు.అధికారులకు కూడా ఎమ్మెల్యే మాధవి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారట. తాను తప్ప ఎవరేం చెప్పినా పనులు చేయవద్దంటూ అందరి అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఎవరి సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకోవద్దని కూడా హుకుం జారీ చేశారు. దీంతో ఈ విషయాన్ని టీడీపీకి చెందిన నాయకులు తమ పార్టీ నాయకత్వానికి, జిల్లా మంత్రికి కూడా తెలియజేసినా లోకం మాధవి డోన్ట్ కేర్ అంటుండటంతో ఏమీ చేయలేక నిస్సహాయతతో ఉండిపోయారంటున్నారు. అయినా సరే వచ్చే ఎన్నికల నాటికి లోకం మాధవిని పూర్తిగా సైడ్ చేసే పనిలోనే కూటమి పార్టీలోని నేతలు ఉన్నారన్నది మాధవి అనుచరులు చెబుతున్నారు. కానీ మాధవి మాత్రం తగ్గేదేలేదంటూ తన పని తాను చేసుకు వెళుతున్నారు. తాజాగా జరిగిన ఘటన వెనక కూడా కూటమి నేతల ప్రమేయం ఉందని మాధవి అనుమానిస్తున్నారు. లోకం మాధవిపై మత్స్యకారులు తిరగబడ్డారు. తుపాను సమయంలో తమకు రేషన్ అందలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు రేషన్ పంపిణీ చేయడానికి వెళ్లిన లోకం మాధవిని అడ్డుకున్నారు. పూసపాటి రేగ మండలం కోనాడ గ్రామంలో ఈ ఘటన జరిగింది. అందరికీ ఒకేలా పరిహారం, రేషన్ అందించాలని, వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. దీంతో లోకం మాధవి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే జనసేన నేతలు మాత్రం మత్స్యకారుల వెనక కూటమి పార్టీలకుచెందిన నేతల ప్రమేయం ఉందని అనుమానిస్తున్నారు. జనసేనను నియోజకవర్గంలో ఇబ్బంది పెట్టేందుకు ఇలాంటి చర్యలకు కూటమి పార్టీలోని మిత్రులే ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరి కూటమి నేతల మధ్య కీచులాటలు ఎక్కడకు దారితీస్తాయన్నది క్యాడర్ లో ఆందోళన కలిగిస్తుంది.

# ఇక ఏఐ సాయంతో తిరుమల దర్శనం

తిరుమల, నవంబర్ 6, తిరుమల శ్రీవారి దర్శనం కోసం కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సాంకేతికత సాయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో శ్రీవారి భక్తులకు రెండు గంటల్లోగా దర్శనం కల్పించే ఆలోచనను టీటీడీ గతంలో చేసింది.

అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటంతో పాటుగా కొంతమంది నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏఐ సాయంతో రెండు గంటల్లో శ్రీవారి దర్శనం గురించి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై కాస్త వెనుకడుగు వేసిన టీటీడీ .. మరోసారి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించే ఆలోచన చేస్తోంది. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఏఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం గురించి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించాలనే ఆలోచన గతంలో చేసినట్లు బీఆర్ నాయుడు వివరించారు. అయితే ఓ వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. టీటీడీ నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ ఏఐ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు. భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తున్నామని.. లడ్డూ ప్రసాదంలోనూ చాలా మార్పులు చేశామన్నారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదాలు 10 రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తుల నుంచ్ స్పందన వస్తోందన్నారు. తిరుపతివాసులు మూడు వేల మందికి ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని వివరించారు. తిరుమల కాటేజీలకు దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించామని.. టీటీడీలోని అన్యమతస్తులను కూడా కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించామన్నారు. తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాల విషయంలోనూ మార్పులు చేశామని బీఆర్ నాయుడు వివరించారు. ఉదయం పదిన్నరకు ఉండే బ్రేక్ దర్శనాలను తెల్లవారుజామునకు మార్చామన్నారు. శ్రీవాణ ట్రస్టు కింద 5 వేల ఆలయాల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గుడులు, భజన మందిరాలు నిర్మించనున్నట్లు తెలిపారు.

మరోవైపు తిరుమల తరహాలో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాల్లో నిత్యాన్నదానం అమలు చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు. తిరుపతి తిరుమల మధ్యన ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతామని టీటీడీ ఛైర్మన్ చెప్పుకొచ్చారు. కేంద్ర మంత్రి కుమారస్వామి టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామన్నారని.. వాటిని తిరుపతి, తిరుమల మధ్య నడపనున్నట్లు తెలిపారు.

దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం నిర్మిస్తామన్న టీటీడీ ఛైర్మన్.. కరీంనగర్లో రూ.30 కోట్లతో , దుబ్బాకలో రూ.4.5 కోట్లతో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

# బస్సు దగ్ధం ప్రయాణికులు క్షేమం

విశాఖపట్నం పాచిపెంట మండలం రొడ్డవలస సమీపంలో ఉదయం 7.45.నిముషాలుకు ఆంధ్ర ఒరిస్సా ఘాట్ రోడ్లో ప్రయాణికులతో విశాఖపట్నం నుండి జైపూర్ వెళ్తున్న ఒరిస్సా ఆర్టిసి బస్సు దగ్ధం అయింది. డ్రైవర్ అప్రమత్తంతో బస్సు నిలిపివేసాడు. ప్రయాణికులు భయాందోళనలతో బస్సు నుండి క్రిందకు దిగిపోయారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. సకాలంలో సాలూరు ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# తమిళ సినిమాల్లో రోజా బిజీ

చెన్నై, నవంబర్ 6, (న్యూస్ పల్స్) మాజీ మంత్రి రోజా 12 ఏళ్ల తర్వాత సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నారు. తమిళ సినిమా 'లెనిన్ పాండియన్'లో 'సంతానం' పాత్రలో నటిస్తున్నారు. రోజాకు ప్రభుదేవా, ఖుష్బూ శుభాకాంక్షలు తెలిపారు. 'లెనిన్ పాండియన్' ఒక ఫ్యామిలీ డ్రామా-ఎమోషనల్ స్టోరీగా రూపొందుతోంది. డైరెక్టర్ బాలచంద్రన్ తమిళ సినిమాల్లో 'విజయ్ సేతుపతి', 'అజిత్' చిత్రాలకు సహాయక డైరెక్టర్గా పనిచేశారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు రోజా పాత్ర 'సంతానం' ఒక బలమైన మహిళా క్యారెక్టర్, కుటుంబ సంక్షోభాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లుగా వీడియో బట్టి అర్థం చేసుకోవచ్చు. నగరి నుంచి రెండు సార్లు గెలిచిన రోజా.. కొంత కాలం మంత్రిగా చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆమె తన పాత రంగంపై దృష్టి పెట్టారు. మెల్లగా టీవీషోలు.. సినిమాల వైపు వెళ్తున్నారు. 'జీ తెలుగు సూపర్ సీరియల్ చాంపియన్షిప్ సీజన్ 4' అనే రియాలిటీ షోలో జడ్జ్గా వ్యవహరించారు. తమిళంలోనూ కొన్ని టీవీ షోలు చేశారు. రోజా 90లో సూపర్ గ్లామర్ హీరోయిన్ గా పేరు తెచ్చుకున్నారు. తమిళంలోనూ ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమె భర్త సెల్వమణి కూడా ప్రముఖ దర్శకుడే. ఏపీలో కన్నాతమిళంలో అయితే మంచిదని అక్కడే రీఎంట్రీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా పేరు తె?చ్చుకున్న రోజా ఇటీవలికాలంలో పెద్దగా స్పందించడం లేదు. ఆమె సైలెంట్ అయ్యారన్న ప్రచారం జరుగుతోంది. అయితే అడపాదడపా ఆమె నగరిలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించింది. సెప్టెంబర్ లోనే దీనిపై నివేదిక వచ్చింది. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వానికి టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతో ఆమె సినిమాల్లో నటిస్తున్నారని.. మళ్లీ ఎన్నికల సమయంలోతనదైన ఫైర్ బ్రాండ్ పాలిటిక్స్ చేస్తారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

# రాజధానికి మీరు సలహాలు ఇవ్వొచ్చు...

విజయవాడ, నవంబర్ 6 ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించాలని కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం హయాంలో అమరావతిలో ఆగిపోయిన పనులను పునరుద్ధరిస్తోంది. మరోవైపు, పూర్తిస్థాయి రాజధాని నిర్మాణం కోసం అవసరమయ్యే నిధుల సేకరణకు ప్రయత్నాలు చేస్తోంది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ. 32,500 కోట్ల నిధులు సేకరించేందుకు సిద్ధం అయింది. ఈ నేపథ్యంలో కేవలం అమరావతి మాత్రమే కాకుండా.. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రణాళికలను రూపొందించడంలో ప్రజలను కూడా భాగస్వాములు కావాలని తాజాగా ప్రభుత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత 'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంలో మాతో చేరండి అని ప్రజలను ఆహ్వానించింది.'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంపై ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) ఓ ప్రకటన చేసింది. అందులో.. ఏపీసీఆర్డీఏ ప్రపంచ స్థాయి రాజధాని ప్రాంతాన్ని నిర్మించేందుకు 'విజన్ 2047'ను రూపొందిస్తోందని తెలిపింది. విజన్ కార్యచరణలో భాగంగా, ప్రజలు, వివిధ భాగస్వాముల నుండి రాజధాని ప్రాంతీయ అభివృద్ధి సంస్థ పరిధి కోసం ఆలోచనలు, సూచనలు, ప్రాధాన్యతలు, అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపింది. సీఆర్డీఏ ప్రాంతం సుమారు 8600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉందని తెలిపింది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రణాళికా ప్రాంతాలలో ఒకటని వెల్లడించింది. ఈ రాజధాని ప్రాంతంలో.. కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల్లోని 56 మండలాలను ఉన్నాయని వివరించింది. విజయవాడ, గుంటూరు, అమరావతి, మంగళగిరి? తాడేపల్లి లాంటి నగరాలతో పాటు 900కు పైగా గ్రామాలు రాజధాని పరిధిలో ఉన్నాయని పేర్కొంది.ఈ క్రమంలో ప్రజలు వెల్లడించే అభిప్రాయాలు.. ఏపీసీఆర్డీఏ బృహత్ప్రణాళిక (మాస్టర్ ప్లాన్ ), విజన్‌కు తోడ్పడతాయని సీఆర్డీఏ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఒక గూగుల్ ఫామ్ తయారు చేసింది. ఈ ఫామ్ నింపి సీఆర్డీఏ ప్రాంతం అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రజలను కోరింది. కాగా, ఈ సర్వేలో భాగస్వాములు కావాలనుకునే వారు సీఆర్డీఏ వెబ్‌సైట్ (ఇ.తీటజీ.జీజూ.ఐనీల.తిని)లోకి వెళ్లి లింక్‌పై క్లిక్ చేయడం లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చు. గూగుల్ ఫామ్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంది. ఇక్కడ అడిగిన ప్రశ్నలకు టిక్ మార్క్ పెట్టి ప్రజలు తమ అభిప్రాయాలు తెలపవచ్చు. అయితే ఆంధ్రప్రదేశ్ వాసులు మాత్రమే కాకుండా.. విదేశాల్లో ఉన్నవారు.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా, ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయొచ్చు.

2028 నాటికి చట్టబద్ధత

రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల కార్యాలయాల నిర్మాణం జరుగుతోంది. బ్యాంకింగ్ రంగ సంస్థల కార్యాలయాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన జరగనుంది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ జరుగుతోంది. అయితే గత అనుభవాల దృష్ట్యా అమరావతిని చట్టబద్ధత చేయాల్సిన అవసరం ఉంది. సిఆర్డిఏ చెబుతున్నట్టు ఐదు జిల్లాల పరిధిలో దాదాపు తొమ్మిది వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న అమరావతికి పార్లమెంట్ ఆమోదముద్ర తక్షణ అవసరం. గత అనుభవాల దృష్ట్యా ఇది కీలకం కూడా. చట్టబద్ధత కల్పిస్తే.. అమరావతి అనే దానిని కదిలించలేరు కూడా. అయితే 2029 ఎన్నికల నాటికి అమరావతిని ఒక రూపానికి తెచ్చి ప్రజలకు ఓటు అడగాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అంటే కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి చట్టబద్ధత కల్పిస్తుందన్నమాట.అమరావతి రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే గ్రేటర్ హైదరాబాద్ మాదిరిగా అమరావతిని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావాలన్నది ఆరాటంగా తెలుస్తోంది. అయితే 2014లో అందరి ఆమోదముద్రతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. పనులు కూడా ప్రారంభించారు. కానీ 2019లో అధికారం మారిపోయేసరికి మూడు రాజధానులు అంశం తెరపైకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిర్వీర్యం చేసింది. దాని పర్యవసానాలు అందరికీ తెలిసిన విషయమే. భూములు ఇచ్చిన రైతులు రోడ్డెక్కారు. వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అయితే వారి ప్రార్థనలు ఫలించి టిడిపి కూటమి వచ్చింది. లేకుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఊహించలేం. వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే అమరావతి అనేది పూర్తిగా నిర్వీర్యం అయిపోయేది. గత అనుభవాల దృష్ట్యా అమరావతి రాజధాని నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది కూటమి ప్రభుత్వం. అదే సమయంలో అమరావతిని కదిలించలేని స్థితిలోకి చేర్చాలని ఒక పట్టుదలతో ఉంది. అయితే అది 2028 లోనే చేయాలన్న తలంపుతో ఉంది. ఎందుకంటే ఆ సమయానికి అమరావతి రాజధాని నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది. అమరావతికి ఒక రూపు తెచ్చి.. పార్లమెంటులో బిల్లు పెట్టాలని చూస్తోంది టిడిపి కూటమి ప్రభుత్వం. అలా ఆ బిల్లును ఆమోదించి.. అమరావతిని శక్తివంతమైన నగరంగా మార్చాలన్నది చంద్రబాబు ప్రణాళిక. తద్వారా ప్రజలకు గట్టి సంకేతాలు పంపించనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా డ్యామేజ్ చేయనున్నారు. అసలు అమరావతి విషయంలో స్టాండ్ ఏంటి అని వైసిపి చెప్పుకోలేని స్థితికి తేనున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఏకపక్ష మద్దతు.. పార్లమెంటులో అమరావతి బిల్లు ప్రవేశ పెడితే ఏకపక్షంగా ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ఎందుకంటే అమరావతి రాజధానికి అన్ని పార్టీల మద్దతు ఉంది. ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. అయితే ఆ పార్టీ జాతీయస్థాయిలో ఏ కూటమితో కూడా లేదు. తెలుగుదేశం, జనసేన ఎన్డీఏ కూటమిలో ఉంది. ఇండియా కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తోంది.

వామపక్షాలు సైతం అదే కూటమిలో ఉన్నాయి. కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు సైతం అమరావతి రాజధానికి జై కొట్టాయి. దీంతో బిల్లు ప్రవేశపెట్టడమే తరువాయి చాలా సులువుగా ఆమోదముద్ర వస్తుంది. చంద్రబాబులో కూడా అదే ధీమా. ఇప్పుడు గాని చట్టబద్ధత కల్పిస్తే రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం ఉండదు. 2028 నాటికి అమరావతికి ఒక తుది రూపు తెచ్చి.. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# భారతీయులకు కెనడా షాక్

హైదరాబాద్, నవంబర్ 6, ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లాలని కలలు కంటున్న వేలాది మంది భారతీయ విద్యార్థులకు ఇటీవల భారీ షాక్ ఇచ్చింది ఆ దేశం. దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో దాదాపు ముగ్గురు.. అంటే 74 శాతం మంది విద్యార్థుల స్టడీ పర్మిట్లను కెనడా ఇమ్మిగ్రేషన్ అధికారులు నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే రెండేళ్లలోనే రెట్టింపు కంటే ఎక్కువగా తిరస్కరణకు గురి కావడం గమనార్హం. కాగా, కెనడా ఇప్పుడు మరో పిడుగు వేయనున్నట్లు తెలుస్తోంది. సామూహికంగా వీసాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇలా మాస్ వీసా క్యాన్సిలేషన్ అధికారాల కోసం కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి అమెరికా సంస్థలతో కలిసి.. ఇమిగ్రేషన్, రెఫ్యూజీ, సిటిజన్‌షిప్ కెనడా, కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ లు.. ఇమిగ్రేషన్ మంత్రిత్వశాఖకు ఇప్పటికే ఓ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు ప్రచురించిందివీసా మోసాలను అరికట్టేందుకు కెనడా ఈ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ నుంచి వీసా మోసాలు పెరుగుతున్నాయన్న అనుమానాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ఈ మేరకు ఇచ్చిన ప్రెజెంటేషన్‌లో.. మోసపూరిత విజిటింగ్ వీసా దరఖాస్తులను రిజెక్ట్ చేయడం, రద్దు చేయడం కోసం కెనడా సంస్థలు.. అమెరికా భాగస్వామ్యపక్షాలు ఓ వర్కింగ్ గ్రూప్‌గా ఏర్పడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే వీసా దరఖాస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటులోనూ ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే.. మహమ్మారి, యుద్ధాలు వంటి అసాధారణ సందర్భాల్లో లేదా నిర్దిష్ట దేశాల వారి వీసాలను సామూహికంగా రద్దు చేయడానికి ఆ దేశ అధికారులకు అనుమతి వస్తుంది.కెనడా ఇలా చేస్తుందనే వార్తా నివేదికలతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కెనడా ప్రవేశపెట్టబోతున్నట్లు చెబుతున్న బిల్లుపై దాదాపు 300 స్వచ్ఛంద సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నయి వార్త కథనాలు పేర్కొన్నాయి. ఈ తరహాలో వీసాలను రద్దు చేయడం.. 'సామూహిక బహిష్కరణ కార్యక్రమాన్ని' చేపట్టేందుకు ప్రభుత్వానికి వీలు కల్పిస్తుందని మైగ్రెంట్ రైట్స్ నెట్‌వర్క్ వెల్లడించింది. పెరుగుతున్న పెండింగ్ వీసా దరఖాస్తులను తగ్గించేందుకు ప్రభుత్వం ఇలా చేస్తోందని నిపుణులు అంటున్నారు. కెనడా తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.భారత్‌ను దృష్టిలో పెట్టుకునే కెనడా ఈ మాస్ వీసా క్యాన్సిలేషన్ల హక్కుల కోసం ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు భారతీయ విద్యార్థుల పట్ల కూడా కెనడా ఇదే వైఖరి అవలంభించింది. భారత విద్యార్థుల తిరస్కరణ రేటు (74 శాతం).. మిగతా అంతర్జాతీయ విద్యార్థుల సగటుతో (40 శాతం) పోలిస్తే చాలా ఎక్కువ కావడం గమనార్హం.

# తలసరి ఆదాయం 11.5 లక్షలా

హైదరాబాద్, నవంబర్ 6,దేశంలో స్వచ్ఛతకు, చదువులకు, ఆర్థిక స్థితిగతులకు ఆయా శాఖలు ర్యాంకులు ఇస్తుంటాయి. తాజాగా 2024?25 ఆర్థిక సర్వే ఆధారంగా దేశంలోని జిల్లాలకు ర్యాంకులు ప్రకటించింది.

ఇందులో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలోనే అత్యంత సంపన్న జిల్లాగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ జిల్లా తలసరి సామాన్య ఆదాయం సుమారు 11.46 లక్షలు.రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ అనే మెట్రో నగరంలో భాగంగా ఉంది.

ప్రధానంగా ఐటీ రంగం, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమల విస్తారమైన ప్రాథమిక కార్యకలాపాలు ఈ పెరుగుదలకు ముఖ్య కారణాలు. అపరిమితమైన రవాణా కనెక్టివిటీ, ఆధునిక సాంకేతిక పార్కులు, మలుపు తిరుగుతున్న వ్యాపార వాతావరణం ప్రాంత ఆర్థికాభివృద్ధిని భారీగా పెంచాయి.ద్వితీయ స్థానం హర్యానా రాష్ట్రంలోని గురుగ్రామ్‌కు (రూ.9.05 లక్షలు), మూడోది బెంగళూరు అర్బన్ (రూ.8.93 లక్షలు), తర్వాత ఉత్తరప్రదేశ్‌లో గౌతమ్ బుద్ధనగర్ (నోయిడా), హిమాచల్ ప్రదేశ్‌లో సోలాన్, గోవా, సిక్కిం, కర్ణాటకలో దక్షిణ కన్నడ, మహారాష్ట్ర ముంబై, గుజరాత్ అహ్మదాబాద్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ జాబితాలోని ప్రాంతాలు ఐటీ, పరిశ్రమలు, పారిస్‌కార్లు, పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలతో దేశ ఆర్థిక శక్తికి పెరుగుదల తేవడానికి తోడ్పడుతున్నాయి.రంగారెడ్డి జిల్లాలోని ఆర్థిక ప్రగతి మెట్రో జనాభా ప్రభావం, నగర, పట్టణాల విస్తీర్ణానికి సంబంధించినది. దీనివల్ల స్థానిక స్థాయిలో ఉద్యోగాలు పెరిగి, పెట్టుబడులు పుంజుకోవడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో విజయవంతమైన కేంద్రంగా అధిక పాత్ర పోషిస్తోంది.

గురుగ్రామ్, బెంగళూరు అర్బన్, నోయిడా తదితర పట్టణాలు కూడా ఐటీ కారిడార్లు ఉన్న నగరాలే. ఆర్థిక ప్రగతిలో ఐటీ రంగం కీలక పాత్ర పోషిస్తోంది.ఈ విజయం స్థానిక ప్రభుత్వాలు, దేశ ఆర్థిక విధానంలో స్థానిక సామర్థ్యాన్ని గుర్తించి, మరింత అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు చేయడానికి ప్రేరణ కల్పిస్తోంది. రంగారెడ్డికి ఇలాంటి ఆర్థిక స్థానాన్ని మరింత పెంచుకునే అవకాశాలు ఉంటాయి.

# నో వర్క్... నో శాలరీస్...

# వైసీపీ ఎమ్మెల్యేల దారేది

విజయవాడ, నవంబర్ 6, ఏపీలో శీతాకాలం అసెంబ్లీ సమావేశాలు దగ్గర పడుతున్నాయా? ఈసారి వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తారా? లేకుంటే వేటు ఎదుర్కొంటారా? స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలతో ఆ ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైందా? స్పీకర్ వ్యాఖ్యలు వెనుక అసలు ఉద్దేశం ఏంటి? ఈసారి అసెంబ్లీకి రాకుండే వేటు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలపై వేటు ఖాయమా? వైసీపీలోని 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు రాని వైసీపీ ఎమ్మెల్యేలపై చర్యలకు సిద్ధమవుతున్నారు స్పీకర్. రాజ్యాంగబద్ధంగా తీసుకునే చర్యలపై పరిశీలన చేస్తున్నామన్నారు. మాజీ సీఎం జగన్ తప్ప, ఆ పార్టీకి చెందిన మిగతా 10 మంది ఎమ్మెల్యేలు ఏడాదిన్నరగా జీతాలు తీసుకొంటున్నారని వ్యాఖ్యానించారు. ఒక ఉద్యోగి ఆఫీసుకు రాకుంటే సస్పెండ్ చేస్తున్నామని, మరి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుంటే తొలగించవద్దా? అంటూ ప్రశ్నించారు. ఈ లెక్కన వచ్చే సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అసెంబ్లీకి వెళ్లి లైవ్‌లో కనిపించాలని వైసీపీ ఎమ్మెల్యేలు తహతహలాడుతున్నారు. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యల వెనుక. అలాగని పార్టీ అధినేత నిర్ణయాన్ని ధిక్కరించలేదు. ఈ నేపథ్యంలో జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అసెంబ్లీకి వెళ్లమని పార్టీ ఎమ్మెల్యేలకు చెబుతారా? వద్దంటారా? ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లాలని భావిస్తున్నట్లు వైసీపీ నుంచి చిన్నపాటి ఫీలర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారి పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నచందంగా మారింది.స్పీకర్ వ్యాఖ్యల వ్యవహారం వైసీపీలో ముసలం మొదలవ్వడం ఖాయమని అనేవాళ్లు లేకపోలేదు. గెలిచిన ఎమ్మెల్యేలు కనీసం నియోజకవర్గం సమస్యలను చెప్పుకోవడానికి లేకుండా పోయిందని లోలోపల మదన పడుతున్నారు. ఈ లెక్కన స్పీకర్ వ్యాఖ్యలు ఆ పార్టీ నేతల్లో కలకలం రేపుతున్నాయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల నాటికి వైసీపీ అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఎమ్మెల్యేల మాట ఏమోగానీ, అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది జగన్ మాత్రమే

వాళ్లందరూ శాలరీ తీసుకుంటున్నారు

వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకోవడంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని 10 మంది ఎమ్మెల్యేలు ప్రతి నెల జీతాలు తీసుకుంటున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే జీతం తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై రాజ్యాంగ బద్ధంగా చర్యలు తీసుకుంటామని, అసెంబ్లీలో చర్చలు జరిపిస్తానని స్పీకర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతిపక్షంగా మారింది. కానీ పది శాతం సీట్లు రాకపోవడంతో ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్ న్యాయపోరాటం చేస్తున్నారు. కానీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో వైసీపీ అసెంబ్లీ సమావేశాలకు బాయ్‌కాట్ చేస్తోంది. ఈ క్రమంలో 11 మంది ఎమ్మెల్యేలు జగన్ సహా హాజరు కావడం లేదు. జగన్ తన జీతాన్ని తీసుకోవడం లేదని, మిగిలిన 10 మంది తీసుకుంటున్నారని స్పీకర్ మీడియాకు చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోతే చర్యలు తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. "రాజ్యాంగ బద్ధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది పరిశీలిస్తున్నాము" అని స్పష్టం చేశారు. జీతం తీసుకుని డ్యూటీ చేయకపోతే ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని, ఉద్యోగం నుంచి తీసేస్తామని ..అటువంటిది ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు?" అని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. "అసలు కోడికి గుడ్డుకు తేడా తెలియని వైసీపీ వాళ్ల గురించి మాట్లాడటం వేస్ట్" అని అన్నారు. రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టాయని, రాజకీయాలు కాస్ట్‌లీగా మారిపోయాయని కూడా వ్యాఖ్యానించారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చలు జరగనున్నాయని, ప్రజల సమస్యలపై చర్చించాలంటూ ఎమ్మెల్యేలకు సూచించారు. ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడంపై అసెంబ్లీలో చర్చించి ఎమ్మెల్యేల జీతాలు ఆపివేయడం లేదా సస్పెన్షన్‌లు విధించడం వంటివి జరగవచ్చు. ఈ మధ్య అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కాకుండా, ప్రజల సమస్యలు చర్చించకపోవడం పట్ల నేతలు కూడా తీవ్ర విమర్శల చేస్తున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గతంలో కూడాపై తీవ్ర వ్యాఖ్యలు చేసి, మంత్రులు, ఎమ్మెల్యేలపై చురకలు వేసిన సందర్భాలు ఉన్నాయి. ఈసారి జీతాల విషయం కీలకంగా మారింది.

# జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 6, హైదరాబాద్, విజయవాడ మధ్య ఉన్న జాతీయ రహదారిలో ప్రయాణించేవారికి శుభవార్త. త్వరలోనే వీరికి ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్-విజయవాడల మధ్య ఉన్న 65వ జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాతీయ రహదారిలో 40వ కిలోమీటరు నుంచి 269వ కిలోమీటరు వరకు మొత్తం 229 కిలోమీటర్ల పొడవున రహదారిని 4 లేన్ల నుంచి 6 లేన్లకు విస్తరించనున్నారు. ఈ నేషనల్ హైవే విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ కోసం కేంద్ర రహదారి, రవాణాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ భూసేకరణ నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని పలు జిల్లాల్లో భూసేకరణ బాధ్యతలను పలువురు అధికారులకు అప్పగించారు. తెలంగాణ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలంలో 9 గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. నల్గొండ జిల్లాలోని చిట్యాలలో 5 గ్రామాలు, నార్కెట్‌పల్లిలో 5 గ్రామాలు, కట్టంగూర్‌లో 4, నకిరేకల్‌లో 2 గ్రామాలు, కేతేపల్లిలో 4 గ్రామాల్లో భూసేకరణ బాధ్యతలను అక్కడి ఆర్డీఓలకు అప్పగించారు. సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట మండలంలో 4 గ్రామాలు, చివ్వెంలలో 6 గ్రామాలు, కోదాడ మండలంలో 4 గ్రామాలు, మునగాల మండలంలోని 5 గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ జరగనుంది.ఆంధ్రప్రదేశ్ పరిధిలో భూసేకరణ పనులను జాయింట్ కలెక్టర్లకు అప్పగించారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ మండలంలో 4 గ్రామాలు, ఇబ్రహీంపట్నంలో 12 గ్రామాలు, జగ్గయ్యపేటలో 7 గ్రామాలు, కంచికచర్లలో 4 గ్రామాలు, పెనుగంచిప్రోలులో 3 గ్రామాలు, విజయవాడ రూరల్‌లో 1 గ్రామం, విజయవాడ వెస్ట్‌లో 2 గ్రామాలు, విజయవాడ నార్త్ పరిధిలోని 1 గ్రామంలో భూసేకరణ చేపట్టే బాధ్యతలను అక్కడి జాయింట్ కలెక్టర్లకు అప్పగించారు. నేషనల్ హైవే 65 రహదారి విస్తరణతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుంది.

నేషనల్ హైవే 65 మీద జిల్లాలవారీగా దూరం కి.మీ.లలో

యాదాద్రి జిల్లాలో 39.54 కి.మీ నుంచి 62.2 కి.మీ వరకు

నల్గొండ జిల్లాలో 6.2 కి.మీ నుంచి 126.8 కి.మీ వరకు

సూర్యాపేట జిల్లాలో 126.8 నుంచి 191.2 కి.మీ వరకు

ఎన్టీఆర్ జిల్లా 191.2 కి.మీ నుంచి 270.86 కి.మీ వరకు

# రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాల ద్వారా 78వేలమందికి ఉద్యోగాలు

## ఇండస్ట్రీ కనెక్ట్ తో ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

## స్కిల్ డెవలప్ మెంట్ పై మంత్రి నారా లోకేష్ సమీక్ష

అమరావతి: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 406 జాబ్ మేళాల ద్వారా 78వేలమంది యువతకు ఉద్యోగాలు లభించినట్లు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి నారా లోకేష్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... జాబ్ మేళాల్లో మరిన్ని సంస్థలను భాగస్వాములను చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేలా చూడాలని అన్నారు. గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ కు అనుగుణంగా డిజిటల్, ఎఐ సాంకేతికతలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. అధునాతన సాంకేతికతలపై ప్రపంచస్థాయి సంస్థలతో భాగస్వామ్యం కోసం కేంద్రప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వస్తున్న పరిశ్రమలు, వాటి అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఐటిఐ, పాలిటెక్నిక్ ల కరిక్యులమ్ లో మార్పులపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్ మెంట్ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో పాలిటెక్నిక్ చదివిన వారిలో 94.6, ఐటిఐలలో 98శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. యువతకు బ్లూకాలర్ ఉద్యోగావకాశాల కోసం 30 ఇండస్ట్రీ ఎలైడ్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. 12 మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా 1,22,575 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విదేశీ ఉద్యోగావకాశాలను పెంచేందుకు రాష్ట్రంలో జర్మన్, ఇటాలియన్, జపనీస్, కొరియన్ భాషల్లో శిక్షణ కోసం ఇఫ్లూతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ఓంక్యాప్ ద్వారా 1300మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 5 క్లస్టర్ల పరిధిలోని 16 సెక్టార్లలో 273 పారిశ్రామిక సంస్థలతో ఐటిఐ, పాలిటెక్నిక్ లను అనుసంధానం చేసినట్లు చెప్పారు. ల్యాబ్ స్పాన్సర్ షిప్ కోసం 17పరిశ్రమలు ముందుకు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 16 ఇండస్ట్రియల్ క్లస్టర్ల పరిధిలో 16 పెద్ద సంస్థలను గుర్తించి పాలిటెక్నిక్, ఐటిఐలతో అనుసంధానించాలని అన్నారు. రాష్ట్రస్థాయి న్యాక్ సెంటర్ ను మంగళగిరిలో ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై ఐటిఐలలో 30, పాలిటెక్నిక్ కళాశాలలో 23 యాడ్ ఆన్ కోర్సులను ప్రవేశపెట్టామని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటిఐ, పాలిటెక్నిక్ లకు విద్యార్థులకు సంబంధించి 95శాతం అపార్ ఐడి అథెంటికేషన్ పూర్తయినట్లు చెప్పారు.

యువతకు అత్యంత ఉపయుక్తంగా తీర్చిదిద్దిన నైపుణ్యం పోర్టల్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్ కుమార్, ఓంక్యాప్ అడ్వైజర్ సీతా శర్మ, సీడ్యాప్ సిఈఓ నారాయణ స్వామి పాల్గొన్నారు.

# గగన్ యాన్ కు రెడీ అవుతున్న భారత్

బెంగళూరు, నవంబర్ 6,భారత అంతరిక్ష చరిత్రలో అపూర్వ ఘట్టానికి నాంది పలకనున్నారు. ఆరు దశాబ్దాల భారత అంతరిక్ష పరిశోధనల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం మొదలు కాబోతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎొఖీూ చేపట్టిన మానవ సహిత అంతరిక్ష మిషన్ గగనయాన్ ప్రాజెక్టులో తొలి అడుగు వచ్చే నెలలోనే పడబోతోంది..డిసెంబర్‌లో జరగనున్న మిషన్ ఈ దిశలో మొదటి ముఖ్యమైన అడుగు. ఈ ప్రయోగంలో వ్యోమిత్రఅనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోను స్పేస్‌లోకి పంపనున్నారు.కొన్ని సంవత్సరాలుగా మన పరిశోధన సంస్థలు ఈ ఈ స్పేస్ రోబో ను రూపొందించాయి. ఈ మిషన్‌లో ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్ సిస్టమ్, అవియానిక్స్, సేఫ్టీ ప్రోటోకాల్‌లు, లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లు వంటి భాగాలను అసలు అంతరిక్ష పరిస్థితుల్లో పరీక్షించనున్నారు. వ్యోమిత్ర స్పేస్ ఫ్లైట్ సేకరించే డేటా, భవిష్యత్తులో మానవ యాత్రల భద్రతా ప్రమాణాల కోసం కీలకంగా ఉపయోగపడుతుంది.గగనయాన్ మిషన్ భారత అంతరిక్ష చరిత్రలో కొత్త యుగాన్ని ప్రారంభించబోతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన క్రూస్ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్, ఎస్కేప్ సిస్టమ్ వంటి కీలక టెక్నాలజీలను పరీక్షిస్తోంది. దీని లక్ష్యం ? భారతీయ వ్యోమగాములను భవిష్యత్తులో భూమి చుట్టూ కక్ష్యలోకి పంపి, సురక్షితంగా తిరిగి తీసుకురావడం.వ్యోమిత్ర ఫ్లైట్ విజయవంతమైతే, భారత్ మానవ అంతరిక్ష యాత్రకు సాంకేతికంగా సిద్ధమవుతుంది. ఇది మన ఎొఖీూ ధృఢ సంకల్పానికి ప్రతీక. స్వదేశీ రాకెట్ ఇంజినీరింగ్, స్పేస్ రోబోటిక్స్, లైఫ్ సపోర్ట్ టెక్నాలజీలు వంటి రంగాల్లో మనం ఎంత పురోగతి సాధించామో ఈప్రయోగం ద్వారా భారత్ ప్రపంచానికి చాటనుంది. ఇప్పటివరకు ఈ స్థాయికి చేరుకున్న దేశాలు కేవలం అమెరికా, రష్యా, చైనా మాత్రమే. గగనయాన్ ద్వారా భారత్ ఆ జాబితాలో చేరడం, శాస్త్రసాంకేతిక రంగంలో మైలురాయిగా నిలుస్తుంది.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రస్తుతం తన చరిత్రలోనే అత్యంత విస్తృతమైన ప్రణాళికను అమలు చేస్తోంది. 2026 మార్చి నాటికి ఏడు కీలక మిషన్‌లను పూర్తి చేయడం, అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్న ఐదేళ్లలో 50 రాకెట్ లాంచ్‌లు అనే విజన్ సాధించడం ఈ వ్యూహం యొక్క ప్రధాన భాగం. ఈ ప్రణాళికలో కేవలం రాకెట్ ప్రయోగాల సంఖ్య పెరగడం మాత్రమే కాదు మానవ అంతరిక్ష ప్రయాణం, భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం,దీర్ఘకాల మిషన్‌లు వంటి కొత్త దిశల్లోనూ ఇస్రో పయనించనుంది.చంద్రయాన్ సక్సెస్ చేసి.. మంగళయాన్‌ను విజయవంతం చేసిన భారత్.. తన గగనయాన్ ప్రాజెక్టు తర్వాత మరో భారీ టార్గెట్ పెట్టుకుంది. గగనయాన్ ప్రాజెక్ట్‌ను విస్తరించి,భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం కూడా ఇందులో భాగంగా చేర్చారు. దీని కోసం ప్రభుత్వం మొత్తం బడ్జెట్‌ను ?20,193 కోట్లకు (సుమారు వ2.4 బిలియన్) పెంచింది. ఈ బడ్జెట్ కేవలం గగనయాన్ మానవ యాత్రలకే కాదు 2028 వరకు సాగే దీర్ఘకాల మిషన్‌లు, స్పేస్ స్టేషన్ మాడ్యూల్ డిజైన్, లాంగ్-డ్యూరేషన్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లు అభివృద్ధికి కూడా వినియోగిస్తారు. ఈ విస్తృత ప్రోగ్రామ్‌లో 600కి పైగా భారతీయ వెండర్లు, పరిశ్రమలు, టెక్ స్టార్టప్‌లు పాల్గొంటున్నాయి. ఇది స్వదేశీ పరిశ్రమలకు అంతరిక్ష రంగంలో పెద్ద అవకాశాలను తెరుస్తోంది. స్పేస్ హాబిటేషన్, రోబోటిక్ అసిస్టెన్స్, ఆటోమేటెడ్ కంట్రోల్ వంటి సాంకేతిక రంగాల్లో భారత్ తన నైపుణ్యాన్ని ప్రపంచానికి చూపించబోతోంది.

భారత స్పేస్ స్టేషన్ ? 2035 నాటికి లక్ష్యం

భారత స్పేస్ స్టేషన్ నిర్మాణానికి పునాది వేస్తోంది. ఈ ప్రాజెక్ట్ 2035 నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుత బడ్జెట్‌లోని భాగం ప్రారంభ పరిశోధన, హ్యాబిటాట్ మాడ్యూల్ డిజైన్, ఆక్సిజన్ మరియు వాటర్ రీసైక్లింగ్ సిస్టమ్‌లు, స్పేస్ పవర్ జనరేషన్ టెక్నాలజీలు వంటి విభాగాలకు కేటాయించారు. భారత స్పేస్ స్టేషన్ ద్వారా భూమి చుట్టూ స్వతంత్రంగా మానవ యాత్రలు, ప్రయోగాలు, పరిశోధనల సామర్థ్యాన్ని సాధించబోతోంది. ఇది అమెరికా రష్యా, చైనా తర్వాత స్వతంత్ర స్పేస్ స్టేషన్ కలిగిన అరుదైన దేశాల జాబితాలో భారత్‌ను నిలబెట్టనుంది.

# మెట్రో ప్లాట్ ఫాంల వద్ద స్టీల్ గ్రిల్స్

హైదరాబాద్, నవంబర్ 6,హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్లాట్‌ఫామ్‌ల వద్ద స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మెట్రో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట కొన్ని ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసి.. ఆ తర్వాత క్రమంగా అన్ని స్టేషన్లకు విస్తరించాలని చూస్తోంది. రానున్న రెండున్నర ఏళ్లలో హైదరాబాద్‌లోని అన్ని మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.ప్రయాణికులకు భద్రత కోసం హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్.. అనేక చర్యలు చేపడుతోంది. నిత్యం ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, ఇతర పనుల కోసం మెట్రోలో ప్రయాణించేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రద్దీ సమయాల్లో మెట్రో స్టేషన్లు.. ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. నిత్యం మెట్రో రైళ్లలో లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. దీంతో కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా స్టేషన్లు, ప్లాట్‌ఫామ్‌లు నిండిపోతున్నాయి. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు చూస్తున్నారుఇక మెట్రో రైలు వచ్చే సమయంలో ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న ప్రయాణికుల మధ్య తోపులాటలు చోటు చేసుకుంటుండటంతో.. వారు రైలు పట్టాలపై పడే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు ముందుగానే అలర్ట్ అవుతున్నారు. మెట్రో ప్లాట్‌ఫామ్‌లపై స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్రో రైలు డోర్ల వద్ద కాకుండా కోచ్‌ల పొడవునా.. ప్లాట్‌ఫామ్‌పై ఈ ఉక్కు కంచెను ఏర్పాటు చేయనున్నారు.మొదట కొన్ని స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసి.. అవి ఏ రకంగా పనిచేస్తున్నాయో చూసి.. ఆ తర్వాత క్రమంగా మిగిలిన స్టేషన్లకు విస్తరించాలని భావిస్తున్నారు. వచ్చే రెండున్నర సంవత్సరాల్లో నగరవ్యాప్తంగా అన్ని స్టేషన్లలోనూ ఈ స్టీల్ గ్రిల్స్ తీసుకురావాలని యోచిస్తున్నారు. అయితే ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు, నెటిజన్ల నుంచి భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. మెట్రో రైలు వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల.. తోపులాటలు జరిగినా ప్రయాణికులు పట్టాలపై పడి ప్రాణాలు కోల్పోవడం, గాయాల పాలు కాకుండా ఉంటుందని కొందరు పేర్కొంటున్నారు.ఇలా చేయడం వల్ల చాలా ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చని చెబుతున్నారు. అయితే ఇవి ఇప్పటికే ఏర్పాటు చేయాల్సిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయినప్పటికీ మొత్తమే ఏర్పాటు చేయకపోవడం కన్నా ఆలస్యంగానైనా ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషం అంటూ చెబుతున్నారు.కానీ కొందరు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇలా స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల.. మెట్రో రైలు, గ్రిల్స్ మధ్య ప్రయాణికులు ఇరుక్కుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మెట్రో రైలు ప్లా?ట్‌ఫామ్‌పైకి రాగానే అందులోకి ఎక్కేందుకు ఒకేసారి ప్రయాణికులు అంతా ఎగబడితే తోపులాట జరుగుతుందని పేర్కొంటున్నారు. ఇక రైలు ఎక్కి, దిగే ప్రయాణికులకు ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల కొత్త సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు.ఇప్పటికే మెట్రో రైలు డోర్ల వద్ద తోపులాటలు జరుగుతున్నాయని.. ఇక ఆ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తే.. ఆ సమస్య మరింత తీవ్రం అవుతుందని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ముందుగా కొన్ని స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తే.. ప్రయాణికుల నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూసి.. మిగిలిన స్టేషన్లలో ఏర్పాటు చేయాలా వద్దా అనేది చూడాలని ప్రయాణికులు సూచిస్తున్నారు.

# ఎవ్వరికి పట్టని పంచాయితీలు

మెదక్, నవంబర్ 6,జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనం తర్వాత అల్లీపూర్ గ్రామానికి గ్రహణం చుట్టుకుంది. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో ప్రజ లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే గ్రామాన్ని మున్సిపాలిటీ పరిధిలోకి చేర్చడంతో ప్రజల కష్టసుఖాలను పట్టించుకునే వారు కరువయ్యారు.మురుగు కాలువలు నిండినా.. రో డ్లు ధ్వంసం అయినా.. పాఠశాలతో పాటు వివిధ ప్రజోపకరమైన పనులు జరగడం లేదు. గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లో విధి దీపాలు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరాతో పాటు వివిధ పనులు సత్వరమే జరి గేవి. మున్సిపాలిటీలో విలీనం తర్వాత ఇల్లు నిర్మించుకోవాలన్నా వాటి అనుమతులు పొందాలన్నా మున్సిపల్ అధికారులు గ్రా మాన్ని పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజ లు ఆరోపిస్తున్నారు.గ్రామ పంచాయతీగా ఉన్న కాలంలో గ్రామానికి చెందిన వ్యక్తి స ర్పంచ్ గా, వార్డ్ మెంబర్లుగా, గ్రామపంచాయతీ సెక్రెటరీ తదితరులు గ్రామానికి సం బంధించిన వివిధ పనులను పర్యవేక్షించి వారికి కావలసిన పనులను చూసేవారు. మున్సిపాలిటీలో విలీనం తర్వాత గ్రామంలో నెలకొన్న సమస్యలు తీవ్రమవుతున్నాయి. జహీరాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలు రెండు పర్యాయాలుగా వాయిదా పడడంతో గ్రా మంలో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. పాఠశాలలో కూడా విద్యార్థులకు కావలసిన సదుపాయాలను మునిసిపాలిటీ అధికారులు చేపట్టకపోవడంతో వాటిలో పందు లు, కుక్కలు చేరి పాఠశాల పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నాయి.ఎవరైనా ఇల్లు కట్టుకో వాలంటే గతంలో గ్రామపంచాయతీ సర్పం చ్ కానీ గ్రామ సెక్రెటరీకి దరఖాస్తు పెట్టుకుంటే సకాలంలోనే అనుమతులు వచ్చేవి. గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయ డం వల్ల మున్సిపల్ కార్యాలయానికి వెళ్లినా అధికారులు సకాలంలో పనులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రధాన రహదారి నుండి గ్రామానికి వెళ్లే రోడ్డు 10 సంవత్సరాలుగా ధ్వంసం అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రతి సంవత్సరం పన్నులు కడుతు న్నామే తప్ప గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయడం లేదు.ఈ సంవత్సరం పన్నులు వసూలు చేయడానికి గ్రామానికి వచ్చిన అ ధికారులను ప్రజలు నిలదీయడంతో పన్ను లు వసూలు చేయకుండానే వెళ్లిపోయారు. ఈ గ్రామంలో నివసించే ప్రజలు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉండడంవల్ల నిత్యం వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు. దర్గా నుండి అల్లిపురం గ్రామం వరకు రోడ్డు ధ్వంసమైనా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తున్నారు. గతంలో సర్పంచ్ గ్రామ పరిపాలన వ్యవస్థ బాగుండేదని ప్రస్తుతం గ్రామా న్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉంచాలని ప్రజ లు కోరుతున్నారు.

గ్రామ సమస్యలు తీర్చకపోతే మున్సిపాలిటీ నుండి మా గ్రామాన్ని తొలగించాలని కోర్టుకు వెళ్లేందుకు కూడా ఆ గ్రామ ప్రజలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ మున్సిపల్ పాలకవర్గం లేకపోవడం, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడంతో గ్రామం అభివృద్ధికి ఆమడ దూరం లో ఉందని చెప్పవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గ్రామంలోని మురుగు కాలువలు, గుంతలు పడ్డ రోడ్లను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# యూనివర్సిటీలకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ ను రూపొందించండి

## ఉన్నత విద్యలో పాఠ్యప్రణాళికను ప్రక్షాళనకు చర్యలు తీసుకోండి

## ఐటిఐలు, యూనివర్సిటీలను నవంబర్ లోగా పరిశ్రమలతో అనుసంధానించండి

## కేజీ నుంచి పీజీ వరకు స్టూడెంట్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా రూపొందించాలి

## యూనివర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో వందశాతం ప్రాంగణ నియామకాలకు చర్యలు చేపట్టండి

## ఉన్నత విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ ఆదేశం

ఉండవల్లి: ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పరిపాలనకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ రూపొందించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కళాశాలల్లో నాలుగేళ్ల పాటు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం లేదు. అమీర్ పేటలో నాలుగు నెలల కోచింగ్ తో విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఐటిఐలు,



యూనివర్సిటీలను నవంబర్ లోగా పరిశ్రమలతో అనుసంధానానికి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారును ఆదేశించారు. ప్రైవేటు కాలేజీలను కూడా నైపుణ్యం పోర్టల్ తో అనుసంధానం చేసి ప్రాంగణ నియామకాలకు గ్యారంటీ ఇవ్వాలని, కశాశాలల్లో తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు స్టూడెంట్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా రూపొందించాలని, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీపైనా సమావేశంలో చర్చించారు. సమర్ద్, ఈ – గవర్నెన్స్ పైనా సమావేశంలో చర్చించారు. యూనివర్సిటీలు, ఐటిఐ, ట్రిపుల్ ఐటీల్లో ప్రాంగణ నియామకాలపై ఈ సందర్భంగా మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల వందశాతం ప్రాంగణ నియామకాలకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్ని యూనివర్సిటీల్లో స్టూటెండ్ ఫీడ్ బ్యాక్ మెకానిజం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇంటర్మీడియట్ లో ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు చేపట్టండిఇంటర్మీడియట్ లో ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఇంటర్ విద్యపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇంటర్ లో చేపట్టిన సంస్కరణలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. ఇకపై అన్ని గ్రూపులకు వారాంతపు పరీక్షలు నిర్వహించడంతో పాటు ట్రాకింగ్ వ్యవస్థను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వృత్తి విద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులను ట్రాకింగ్ చేయాలి. ప్రైవేటు కాలేజీలకు అనుమతులపై కాలపరిమితి ఉండాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపైనా మంత్రి సమీక్షించారు. ఈ ఏడాది 25 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఈ దిశగా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ప్రైవేటు యూనివర్సిటీలపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, కళాశాల విద్యాశాఖ డైరక్టర్ నారాయణ భరత్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# డిసైడింగ్ ఫ్యాక్టర్ సెటిలర్సే

హైదరాబాద్, నవంబర్ 6, తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర రాజకీయ పరిస్థితులు నడుస్తున్నాయి. ఎవరికి ఎవరు మిత్రుడో.. ఎవరు శత్రువో తెలియడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విరుద్ధ ప్రభుత్వాలు ఉన్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏపీలో టీడీపీ కూటమి పాలన సాగిస్తోంది. టిడిపి కూటమిలో బిజెపి ఉంది. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఎన్డీఏ తో పాటు బిజెపికి బద్ధ శత్రువు కాంగ్రెస్. ఈ లెక్కన రెండు ప్రభుత్వాలు రాజకీయంగా విరుద్ధంగా ఏర్పడినవి. మరోవైపు ప్రతిపక్షాలు సైతం భిన్న స్థితిలో ఉన్నాయి. ఏపీలో ప్రధాన ప్రతిపక్ష హోదా రాకపోయినా.. ప్రతిపక్ష పార్టీల్లో అతిపెద్దది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణలో ఉన్న కేసీఆర్ పార్టీతో వైసీపీకి మైత్రి ఉంది. ఇటువంటి సందిగ్ధ రాజకీయ పరిస్థితుల్లో తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతోంది.తెలంగాణలో జరుగుతున్న ఈ ఉప ఎన్నికల్లో.. కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ అన్నట్టు పరిస్థితి ఉంది. మరో బలమైన ప్రాంతీయ పార్టీగా ఉన్న ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది. దీంతో టీడీపీతో పాటు జనసేన పరిస్థితి ఏంటి అన్నది తెలియడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ ఇప్పటికే బీఆర్ఎస్ కు మద్దతు గా నిలవడమే కాదు ప్రచారం కూడా చేస్తోంది. ఎందుకంటే 2014 రాష్ట్ర విభజన నాటి నుంచి కెసిఆర్ తో స్నేహం కొనసాగిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఈ ఇద్దరూ క్లిష్ట పరిస్థితుల్లోనే ఉన్నారు. అందుకే ఒకరికొకరు సహకరించుకోవడమే తప్ప మరో పరిస్థితి ఉండదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్ రెడ్డిముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. 2023 ఎన్నికల్లో సైతం తెలుగుదేశం సైలెంట్ కావడంతోనే కాంగ్రెస్ గెలిచిందన్న ఒక వాదన ఉంది. ఎందుకంటే అప్పుడు చంద్రబాబు జైల్లో ఉన్నారు. బిజెపితో మైత్రి కుదరలేదు. అటు బిజెపి సైతం టిడిపి సహకారం కోరలేదు. తెలుగుదేశం పార్టీ తటస్థ వైఖరి అనుసరించింది. చంద్రబాబు పట్ల రేవంత్ చూపే అభిమానం.. ఆ పై రేవంత్ తెలంగాణ సీఎం అవుతాడని భావించిన టిడిపి శ్రేణులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషణలు వచ్చాయి. అందుకు తగ్గట్టుగానే రేవంత్ విజయం సాధించిన తరువాత కూడా చంద్రబాబు పట్ల తన అభిమానాన్ని చాటుకుంటూ వచ్చారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కొనసాగుతూనే.. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మాత్రం ఎవరికి వారు పట్టుపడుతూ వచ్చారు. ఈ తరుణంలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరుగుతుండడంతో టిడిపి మద్దతు ఎవరికీ అనే వాదన వినిపిస్తోంది.జూబ్లీహిల్స్ లో సెటిలర్స్ అధికం. ఆపై కమ్మ సామాజిక వర్గ ప్రాబల్యం ఉంటుంది. అదే సమయంలో ఏపీకి చెందిన రెడ్డి సామాజిక వర్గం సైతం ఉంది. ఎప్పటికీ వైసీపీ స్టాండ్ అదే. తెలంగాణలో బిఆర్ఎస్ గెలిస్తే.. ఆ పార్టీకి జవసత్వాలు వస్తాయి. అది ఏపీ పై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే వైసిపి కెసిఆర్ పార్టీకి మద్దతు తెలుపుతోంది. సహజంగానే తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన వైసీపీని వ్యతిరేకిస్తాయి. జూబ్లీహిల్స్ లో ఉన్న సెటిలర్స్ టిడిపి తో పాటు జనసేన ను అభిమానిస్తే వారంతా కాంగ్రెస్ వైపు టర్న్ అవుతారు. వైసీపీని అభిమానించిన వారు కెసిఆర్ పార్టీ వైపు వెళ్తారు. సో ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఏపీ పార్టీలే కీలకం అన్నమాట.

## ఒంగోలు వద్ద మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు టంగుటూరు టోల్ గేట్‌వద్ద మంత్రి నారా లోకేష్ కు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కందుకూరు నియోజకవర్గం తెట్టు వద్ద ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చారు. భారీ గజమాలతో మంత్రి లోకేష్ కు ఘనస్వాగతం పలికారు. పార్టీ జెండాలు, పుష్పగుచ్ఛాలు, జై తెలుగుదేశం నినాదాలతో మంత్రి లోకేష్ కు స్వాగతం లభించింది.

మంత్రి లోకేష్ ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరించి, ఫోటోలు దిగుతూ ముందుకు సాగారు.

## కలెక్టరేట్ ఎదురుగా విద్యార్థుల ధర్నా

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుల ధర్నాకి దిగారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు కాలేజీలు బంద్ ప్రకటించడంతో మూడు రోజులుగా విద్యార్థులు ఇంట్లోనే ఉంటున్నారని... మనస్తాపం చెంది విద్యార్థులు ఏమైనా చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాలేజీలు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని...రాజ్ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు

# లోకల్ బాడీ ఎన్నికలు

## ఇద్దరు నిబంధన రద్దుకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 6, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉన్న 'ఇద్దరు పిల్లల' నిబంధనను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు కూడా ఇకపై స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం లభించింది. మరోవైపు.. పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంపై హైకోర్టు ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి ఉన్న 'ఇద్దరు పిల్లల' నిబంధనను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆయన సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నేడు అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుంది, దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు మార్గం సుగమం అవుతుంది. భారతదేశంలో కుటుంబ నియంత్రణ చర్యలను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు స్థానిక సంస్థలు (గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ), పురపాలక సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా పేర్కొంటూ ఉమ్మడి రాష్ట్రంలో 1994లో ఒక చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ నిబంధన 1995 మే 31 నుంచి అమలులోకి వచ్చింది. ఈ నిబంధనను ఎత్తివేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం 2018, పురపాలక చట్టం 2019లను సవరిస్తూ ఆర్డినెన్స్ జారీకి గత నెల 23న జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీర్మానించింది. ఈ నిబంధన కారణంగా గత కొన్ని దశాబ్దాలుగా అనేకమంది రాజకీయంగా చురుకైన వ్యక్తులు స్థానిక ప్రజాప్రతినిధులుగా మారే అవకాశాన్ని కోల్పోయారు. ముఖ్యంగా, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం, సమర్థ నాయకత్వానికి ఈ నిబంధన ఆటంకంగా ఉందని భావించిన ప్రభుత్వం.. ఈ ఎన్నికలలో పౌరులందరికీ సమాన అవకాశం కల్పించే ఉద్దేశంతో సవరణ చేపట్టింది. మంత్రిమండలి తీర్మానం తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను అదే నెల 24న గవర్నర్ ఆమోదానికి పంపింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అంశంపై న్యాయసలహా తీసుకున్న తరువాత.. తాజాగా దీనికి ఆమోదముద్ర వేశారు. దీని ద్వారా స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, నగరపాలక, పురపాలక ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు కూడా ఇకపై స్వేచ్ఛగా పోటీ చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇక పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంపై హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ఆర్.సురేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని అధికరణ 243(ఇ) ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఎన్నికల సంఘం ప్రభుత్వ నిర్ణయం కోసం ఎందుకు ఎదురుచూస్తోందని ప్రశ్నించింది. పంచాయతీ పాలకవర్గాల గడువు గత ఏడాది జనవరిలోనే ముగిసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రద్దు చేసిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 24కు వాయిదా వేసింది.

# ఈ రోడ్డు బాగుపడేది ఎప్పుడూ

హైదరాబాద్, నవంబర్ 6, రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకర రోడ్డు మార్గాల్లో అదొకటి.. బాగా రద్దీగా ఉండే రూట్లలో ఇదొకటి. నిత్యం చీమల బారులా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగుకో గుంత.. వాహనం అదుపుతప్పితే ప్రాణం పోయినట్లే. నేతలు హామీలు ఇచ్చినా.. ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు రూపు మాత్రం మారడం లేదు. చేవెళ్ల బస్సు ప్రమాదం నేపథ్యంలో మరోసారి వార్తల్లోకెక్కింది. బీజాపూర్ - హైదరాబాద్ జాతీయ రహదారి మొత్తం మూలమలుపులు, ఇరుకైన రోడ్లు ప్రస్తుతం ప్రయాణికులకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. ఉదయం, రాత్రి వేళలో ఈ రహదారి గుండా ప్రయాణాలు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. రయ్.. రయ్ అంటూ దూసుకుపోతున్న డంపర్లు, టిప్పర్లు, లారీల మోతకు ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగించడంతోపాటు పరిమితికి మించి తమ వాహనాల్లో టన్నుల కొద్ది లోడుతో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ రహదారంతా అడుక్కో గుంత మాదిరిగా ప్రమాదకరంగా మారింది. గత మూడు రోజుల క్రితం చేవెళ్ల సమీపం మిర్జాగూడ వద్ద రోడ్డుపైన గుంతను తప్పించబోయి అతివేగంతో కంకర టిప్పర్.. ఆర్టీసీని బస్సును ఢీ కొట్టిన ఘటనలో 19 ముందు ప్రయాణికులు మృతి చెందిన ఘటన అందరిని కలిచి వేస్తుంది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం రోడ్డువిస్తరణ పనులు జాప్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వం... అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. గత 10 ఏళ్ల నుంచి బీజాపూర్ -హైదరాబాద్ రోడ్డు విస్తరణ మీదనే చేవెళ్ల రాజకీయం నడుస్తూ వస్తుంది. కర్ణాటక రాష్ట్రంలోని పలు ముఖ్యమైన జిల్లాలు, వికారాబాద్ నారాయణపేట జిల్లాల కు కొడంగల్, తాండూరు, పరిగి చేవెళ్ల నియోజకవర్గం మీదుగా వెళ్లే రహదారి ప్రధాన రోడ్డు కావడం గమనార్హం. వివిధ ప్రాంతాల ప్రజలంతా రాష్ట్ర రాజధానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రహదారి ప్రతినిత్యం చీమలదండులా వాహనాల బారులు కనిపిస్తూ ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డు విస్తరణ కాకపోవడంతో ప్రతినిత్యం ప్రమాదాలు చోటుచేసుకుని వందలాది ప్రాణాలు పోవడంతో పాటు పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అప్పా జంక్షన్ నుంచి మోయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, వికారాబాద్ వరకు రహదారి అస్తవ్యస్తంగా మారింది. గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఇటీవల కురిసిన వర్షాలకు బీటీరోడ్డు తేలి అధ్వానంగా మారింది. ప్రతినిత్యం ఈ రహదారి నుంచి రైతులు పండించిన పంటలు, కూరగాయలు, పూలు, పండ్లు, తాండూరు నుంచి సిమెంట్ ట్యాంకర్లు, బండలు, పెద్దేముల్ నుంచి సుద్ద, వికారాబాద్, మర్పల్లి, మోమిన్ పేట్, నవాబ్ పేట్ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ఎర్రమట్టి లారీలు రోజు రాకపోకలు సాగిస్తుంటాయి. పరిమితికి మించి సరుకు రవాణా చేసినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. తెలిసిన కూడా మామూళ్ల మత్తులో రవాణా శాఖ అధికారులు తూతూమంత్రంగానే తనిఖీలు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఫోర్ లైన్ల రహదారి కోసం ఐదేళ్ల క్రితమే రూ.925 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే అయితే రోడ్డుకి ఇరువైపులా మర్రిచెట్ల తొలగింపు విషయంపై కొందరు పర్యావరణవేత్తలు గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు దాఖలు చేయడంతో పనులకు బ్రేక్ పడింది. గతంలో మంత్రులుగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, మాజీఎంపీ రంజిత్ రెడ్డి, ప్రస్తుత ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యపై ఉమ్మడి రంగారెడ్డి ప్రజలు ప్రస్తుతం గుర్రుగా ఉన్నారు. రోడ్డు విస్తరణ విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపడంలో విఫలం కావడంతోనే రోడ్డు ప్రమాదాలను బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నాలుగు రోజుల నుంచి చేవెళ్ల, వికారాబాద్ నియోజకవర్గ ప్రజలంతా రోడ్డు విస్తరణ చేపట్టాలంటూ ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా గత పాలకుల తీరుపై విమర్శలు గుప్పిస్తూ అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. రోడ్డు ప్రమాదాల పైన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. రోడ్లు బాగుంటేనే ప్రమాదాలు ఎక్కువ జరగుతాయని ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పై ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డు సరిగా లేకపోతేనే యాక్సిడెంట్లు కావు బండ్లు నెమ్మదిగా వెళ్తాయి...రోడ్లు ఎంత మంచిగా ఉంటే అన్ని ప్రమాదాలు జరగుతాయని అయన కామెంట్ చేయడం పై ప్రజలంతా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. మరో పక్క చేవెళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన రోజే ఎమ్మెల్యే కాల యాదయ్య షాబాద్ లో అభివృద్ధి కార్యక్రమంలో జిమ్ ఓపెనింగ్ పాల్గొనడం పై ఆయనపై సైతం పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో ఇంత పెద్ద ప్రమాదం జరిగి 19 మంది చనిపోతే స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి..ప్రారంభోత్సవాలో ఎలా పాల్గొంటారని నియోజకవర్గ ప్రజలు పలు విమర్శలు చేస్తున్నారు. ఇది ఇది ప్రజల సమస్యలపై నేతలకు ఉన్న చిత్తశుద్ధి అంటూ పలు సామాజిక వేదికల మీద విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు మాత్రం మీ శవ రాజకీయాలు ఆపండి.. చిత్తశుద్ధితో ప్రజలు పడుతున్న బాధలను గుర్తించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలంటే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు సంధిస్తున్నారు.

# వైభవంగా అన్నవరం గిరి ప్రదక్షిణ

అన్నవరం కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయినా అన్నవరం శ్రీ. వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈఉత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి మూడు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. సత్యదేవుడి నామస్మరణతో రత్న, సత్యగిరులు మార్మోగాయి. మధ్యాహ్నం రెండు గంటలకు అన్నవరం తొలిపావం చాల వద్ద గిరి ప్రదక్షిణ ఆరంభమైంది. ప్రధాన రహదారి, జాతీయరహదారి, బెండపూడి పోలవరం కాలువ గట్టు, పంపా సరోవరం మీదుగా గిరుల చుట్టూ 8.2 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేశారు. సత్యనారాయణ స్వామి,అనంతలక్ష్మి రథం ఊరేగింపు మూడున్నర గంటల పాటు సాగింది.

## జగద్గిరిగుట్టలో కత్తిపోట్లకు గురైన యువకుడు రోషన్ మృతి

హైదరాబాద్ జగద్గిరిగుట్టలో కత్తిపోట్లకు గురైన యువకుడు రోషన్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా బాల్శొరెడ్డి అనే రౌడీషీటర్ కత్తితో దారుణంగా పొడిచాడు. ఓ ట్రాన్స్జెండర్కు రోషన్కు మధ్య డబ్బుల పంచాయితీ ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై బాలానగర్ పీఎస్లో ట్రాన్స్జెండర్ ఫిర్యాదు చేయడంతో రోషన్, అతని ఫ్రెండ్స్పై కేసు నమోదు అయింది. ట్రాన్స్జెండర్ కేసు పెట్టేలా పురమాయించింది బాల్శొరెడ్డి అని రోషన్ అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో బాల్శొరెడ్డిని చంపుతానని రోషన్ బెదిరించడంతో.. జగద్గిరిగుట్టలో రోషన్పై బాల్శొరెడ్డి కత్తితో దాడి చేసాడు.

# జూబ్లీ ఎన్నికల్లో కవిత ఎటూ.



హైదరాబాద్, నవంబర్ 6, జూబ్లీహిల్స్ బైపోల్స్ వేళ గులాబీ పార్టీ శ్రేణుల్లో గుబులు మొదలైందంట. జాగృతి అధ్యక్షురాలు కవిత ఇష్యూ బీఆర్ఎస్‌లో హాట్ టాపిక్‌గా మారి ఆమె ప్రభావం ఉప ఎన్నికలలో పార్టీపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అని క్యాడర్ ఆందోళన చెందుతోందంట. బీఆర్ఎస్ నేతలపై కవిత సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గులాబీ పార్టీ శ్రేణులు సతమతమవుతున్నట్లు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ జనంబాట పట్టిన కవిత:. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే బీఆర్ఎస్‌కు విపక్షాల కంటే జాగృతి అధ్యక్షురాలు కవితే పెద్ద గండంగా మారారంటున్నారు. కవిత గులాబీ పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ జనంబాట పట్టారు. అటు కవిత వ్యవహారాన్నే ప్రచార అస్త్రంగా మలుచుకుంటోంది కాంగ్రెస్.. ఆ క్రమంలో భవిష్యత్తులోనూ భవిష్యత్తులోనూ కవిత వల్ల బీఆర్ఎస్‌కు సమస్యే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.. కవిత ఫీవర్‌తో సతమతమవుతున్న గులాబీ శ్రేణులు:. మొత్తానికి బీఆర్ఎస్‌కు కవిత ఫీవర్ పట్టుకున్నట్లే కనిపిస్తోంది.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ పార్టీలో కవిత అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆమె పార్టీకి దూరమైన తర్వాత హైదరాబాద్‌కే పరిమితం అవకుండా రాష్ట్రమంతటా అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నారు. సొంత పార్టీలో తనకు జరిగిన అన్యాయాలను తనను కలుస్తున్న నాయకులకు, కార్యకర్తలకు వివరిస్తున్నారు. అదే ఇప్పుడు గులాబీ పార్టీ నేతలను ఆత్మరక్షణలో పడేస్తోంది. జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా తిరిగి చేజికించుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు ప్రచారంలో కవిత ఇష్యూ తలనొప్పిగా మారిందంట. ఫోన్ ట్యాప్ చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం:. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సొంత కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు కవిత తన జనంబాట పర్యటనలో పదే పదే ప్రస్తావనకు తీసుకొస్తున్నారు..ఇక కేటీఆర్‌కు సొంత బావ అయిన తన భర్త బ్రదర్ అనిల్ ఫోన్ కూడా ట్యాప్ చేయడంపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన ఫోన్ ట్యాప్ చేయడం వరకు సహించాను కానీ, తన భర్త ఫోన్ కూడా ట్యాప్ చేయడం ఏంటని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గులాబీ పార్టీ వల్ల నష్టపోయినట్లు భావిస్తున్న నాయకులను, కార్యకర్తలను కలుస్తుండటం వారికి మద్దతు తెలపడం బీఆర్ఎస్ కు ఒక మైనస్ గా మారుతోందంట. కొద్ది రోజుల్లో జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మొదలుకొని రాబోయే ప్రతి రాజకీయ అంశంలోనూ కవిత ఇష్యూ చర్చకు వచ్చే అవకాశం ఉందంటున్నారు రాజకీయ నిపుణులు. సొంత ఆడబిడ్డకే కేటీఆర్ అన్యాయం చేశారని విమర్శలు:. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ ప్రచారంలో కవిత అంశం కాంగ్రెస్ కు రామబాణంలా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు ఈ అంశాపకపి ప్రచారంలో అనేకమార్లు ప్రస్తావిస్తూ వస్తున్నారు. “సొంత చెల్లికే అన్యాయం చేసినవాడు పక్కింటి ఆడబిడ్డకు ఏం న్యాయం చేస్తాడు? పుట్టింటిపై ఏ ఆడబిడ్డ కూడా ఆరోపణలు చేయదు కానీ సొంత వారిపైనే కవిత బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు” అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో బీఆర్ఎస్‌ను డిఫెన్స్‌లో పడేస్తున్నారు. కుటుంబంలోని వ్యక్తికే అన్యాయం చేస్తే ఇక సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటన్న ప్రశ్నను లేవనెత్తుతూ బీఆర్ఎస్ అగ్రనాయకత్వాన్ని ఇరుకున పడేస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. ఫలితంగా ఉపఎన్నికల బరిలో ఈ అంశం ఓటర్లను ప్రభావితం చేసే స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఇక కవిత ఆరోపణలపై బీఆర్ఎస్ ముఖ్య నాయకులు.. ముఖ్యంగా కేటీఆర్ ఎలా స్పందించాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నట్లు గులాబీ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. కవిత ఆరోపణల వల్ల ఉక్కిరిబిక్కిర అవుతున్న కేటీఆర్:. బహిరంగంగా కవిత ఆరోపణల పైన స్పందిస్తే కుటుంబ కలహాలను తానే రోడ్డున పడేసినట్లు అవుతుందని భయం ఒకపక్క.. మౌనంగా ఉంటే కవిత ఆరోపణలను అంగీకరించినట్లు అవుతుందని కేటీఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని గులాబీ పార్టీ శ్రేణులు అంటగున్నాయి. అయితే కవితను కుటుంబ సభ్యురాలిగా భావించి సంయమనం పాటిస్తున్నానని కేటీఆర్ చెప్తున్నా కూడా.. కవిత మాత్రం తనకు జరిగిన అన్యాయాన్ని వివరించడంలో వెనక్కి తగ్గడం లేదు. తమ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ ఆడబిడ్డ అని, ఆమెను గెలిపించండి అంటూ తన రోడ్ షోలలో కేటీఆర్ మాట్లాడుతున్నారు. కానీ, సొంత ఆడబిడ్డకే అన్యాయం చేసిన కేటీఆర్ ఇతరులకు న్యాయం ఎలా చేస్తారని కాంగ్రెస్ నాయకులు నిలదీస్తున్నారు. చూడాలి మరి.. కవిత అంశం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో

# ఏపీ వ్యాప్తంగా రెండోరోజు ఏసీబీ సోదాలు

అమరావతి రాష్ట్ర వ్యప్తంగా గురువారం రెండవరోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. విశాఖలోని జగదాంబ, మధురవాడ, పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. రిజిస్ట్రేషన్లు, డేటాను పరిశీలించారు. ఆన్లైన్ లావాదేవీలపైనా అధికారులు ఆరా తీసారు. స్టాంప్ డ్యూటీ చెల్లింపులు తీరుపైనా విచారణ జరుపుతున్నారు. ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఆర్థికలావాదేవీలు గుర్తించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో సిబ్బందికి, ప్రైవేట్ వ్యక్తులతో సంబంధాలపై ఏసీబీ ఆరా తీసరింది. ఏసీబీ సోదాలతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం కలిగింది. రెండోరోజూ డాక్యుమెంట్ రైటర్ల ఆఫీస్లు మూతపడ్డాయి.

# బీఆర్ఎస్ మైనారిటీ నేతలపై దాడి

హైదరాబాద్ షేక్ పెట్ డివిజన్ 20,21,22 బిఆర్ఎస్ ముస్లిం మైనారిటీ నాయకుల నివాసంలోకి కాంగ్రెస్ నాయకులు చొరబడి బీభత్సము సృష్టించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలికినట్లు బాధితులు ఆరోపించారు. ఘటనతో అక్కడి మహిళలు భయభ్రాంతులకు గురైయారు. అర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, కాంగ్రెస్ దమనకాండపై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసారు. వాహిద్, షకీల్ అహ్మద్ , అఖిల్ నివాసాల్లోకి దుండగులు చొరబడి దాడి చేసారు.

# సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన

## ఉదయం వాకింగ్ చేసే ప్రజలను కలుసుకుని సూచనలు చేసిన పోలీస్ అధికారులు




రాజన్న సిరిసిల్ల ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే దిశగా పోలీసు శాఖ విస్తృత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది ఇందులో బాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఉదయం వాకింగ్ చేసే ప్రజలను కలుసుకుని, సైబర్ మోసాల భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఈ క్రమంలో, ఉదయం వాకింగ్కు వచ్చే ప్రజలను పోలీసులు ప్రత్యక్షంగా కలుసుకుని, సైబర్ మోసాల నుండి రక్షించుకునే విధానాలపై వివరించారు. ప్రజలు ఆన్లైన్లో ఆర్థిక లావాదేవీలు చేయడం, షాపింగ్, ట్రేడింగ్, సోషల్ మీడియా ఉపయోగించడం వంటి సందర్భాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ మోసగాళ్లు పలు రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని, ఫోన్ కాల్స్, ఫేక్ వెబ్సైట్లు, సోషల్ మీడియా లింక్స్, ఆన్లైన్ ఇన్వెస్ట్మెంట్స్ ద్వారా వ్యక్తిగత వివరాలు దొంగిలించి ఖాతాల్లో నుంచి డబ్బు తీసుకుంటున్నారని తెలిపారు.

# నల్గొండ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

నల్లగొండ మెడికల్ కాలేజీ”లో ర్యాగింగ్ కలకలం రేపింది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫస్టియర్ స్టూడెంట్స్ ను సెకండియర్ స్టూడెంట్స్ ర్యాగింగ్ చేసారు. ఈనెల 4తేదీన ర్యాగింగ్ ఘటన జరిగింది. బాధిత విద్యార్థులు పిర్యాదుచేసినా ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్ పట్టించుకోలేదని ఆరోపించారు. గత నెల 31 తేదీనే హాస్టల్లో సెకండియర్ మెడికల్ స్టూడెంట్స్ ర్యాగింగ్ కు పాల్పడ్డారు. తమపైనే ఫిర్యాదు చేస్తారా..? అని 4వ తేదీన రెండవ సంవత్సరం విద్యార్థులు మళ్ళీ ర్యాగింగ్ కు పాల్పడ్డరని బాధితుల ఆరోపణ.

# ఆసియా ఖండంలోనే నోబెల్ బహుమతి అందుకున్న మొదటి శాస్త్రవేత్త సర్ సివి రామన్

-నేటికి వైద్య రంగంలో మందుల విశ్లేషణకు రామన్ ఎఫెక్ట్‌నే వినియోగిస్తున్నారు -నేడు ఆయన జయంతి




ఒక రోజు మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రముఖ ఇంగ్లిష్ ప్రొఫెసర్ ఇలియట్ డిగ్రీ తరగతి గదిలోకి ప్రవేశించారు. గదిలో మూడో వరుసలో కూర్చున్న ఓ విద్యార్థిని చూసి ఆశ్చర్యంతో..'నీవు ఈ క్లాసు విద్యార్థివేనా?' అని ప్రశ్నించాడు. కళాశాలలో కొత్తగా చేరిన ఆ విద్యార్థి లేచి నిలబడి..“ఔను, సర్ నేను ఈ తరగతి విద్యార్థినే. కాని నా వయసు 13 ఏళ్లు. నేను ఇంటర్ మీడియట్ విద్యను వాల్టేర్ కాలేజీలో పూర్తి చేశాను. నా పేరు సి.వి. రామన్” అని సమాధానం నిర్భయంగా చెప్పాడు. ప్రొఫెసర్ వేసిన ప్రశ్నలన్నింటికీ ధైర్యంగా చకచకా జవాబు చెప్పాడు. ప్రొఫెసర్, ఆ బాలుని తెలివితేటలకు ముగ్ధుడయ్యాడు. నాటి నుంచి ప్రొఫెసర్ ఇలియట్ ప్రియశిష్యులలో ఒకడయ్యాడు సి.వి. రామన్. ఆసియా ఖండంలోనే మొదటి నోబెల్ బహుమతి అందుకున్న శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్.రామన్ ఫిజిక్స్ నుంచి పీజీ పూర్తి చేసినందున భౌతిక శాస్త్రంలో పరిశోధనలు ప్రారంభించారు. తన 18వ ఏటనే కాంతికి సంబంధించిన ధర్మాలపై రాసిన వ్యాసం లండన్ నుంచి వెలువడే ఫిలసాఫికల్ మేగజైన్‌లో ప్రచురితమైంది. ఆయనలోని పరిశోధనాభి రుచిని పరిశీలించిన అధ్యాపకులు ప్రోత్సహించి ఇంగ్లాండు వెళ్లి పరిశోధన చేయమన్నారు. కానీ, ఆయనకు ఆరోగ్యం సహకరించలేదు. వైద్యులు ఇంగ్లండ్ వాతావరణంలో ఇబ్బందులు ఎదుర్కొంటావని హెచ్చరించారు. దీంతో ఆయన ఇంగ్లండ్ ప్రయాణం రద్దు చేసుకున్నాడు. అనంతరం ఎంఏ చదివి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో చేరారు.బాల్యంలోనే గోల్డ్‌మెడల్..:చంద్రశేఖర్ వెంకటరామన్ 1888 నవంబర్ 7 వ తేదీన తమిళనాడులోని తిరుచునాపల్లి సమీపంలోని అయ్యన్ పెటాయ్ అనే గ్రామంలో జన్మించాడు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. వారిది మధ్య తరగతి కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. రామన్ విశాఖపట్నంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. చిన్నతనం నుంచి విజ్ఞాన శాస్త్ర విషయాల పట్ల అమితమైన ఆసక్తిని ప్రదర్శించేవారు. ఆయన తండ్రి భౌతిక అధ్యాపకులవడం, అతనిని భౌతికశాస్త్రం వైపుమరింత కుతూహలం పెంచుకునేలా చేసింది. చిన్నతనం నుంచి తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్న రామన్ తన 12వ ఏట మెట్రిక్యులేషన్ (ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి) పూర్తి చేశాడు. 1907లో ఎంఎస్సీ (ఫిజిక్స్)లో యూనివర్సిటీలో ప్రథమ స్థానంలో నిలిచారు.1917లో ప్రభుత్వ ఫైనాన్స్ ఉద్యోగానికి రాజీనామా చేసిన రామన్.. యూనివర్శిటీ ఆఫ్ కలకత్తాలో ఫిజిక్స్ లెక్చరర్‌గా చేరారు. అదే సమయంలో కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ (ఐఏసీఎస్)లో పరిశోధనను కొనసాగించాడు. ఈ సమయంలో ఎంతోమంది ఆయనకు శిష్యులయ్యారు. వారిలో చాలా మంది జాతీయ స్థాయిలో తర్వాత కాలంలో ప్రముఖ శాస్త్రవేత్తలుగా ఎదిగారు. 1920 ఫిబ్రవరి 28న కె.ఎస్ కృష్ణన్‌తో సహా ఐఏసీఎస్‌లో కాంతి విక్షేపణంపై పరిశోధన చేయడం ప్రారంభించారు. తర్వాత కాలంలో ఇది రామన్ ఎఫెక్ట్‌గా రూపుదిద్దుకుంది. రామన్ ఎఫెక్ట్ అన్వేషణలో కె.ఎస్ కృష్ణన్ పాత్ర కూడా ఎంతో ఉంది. కానీ ఆశ్చర్యకరంగా ఆయన నోబెల్ పురస్కారాన్ని ఉమ్మడిగా అందుకోలేక పోయారు. కానీ, నోబెల్ పురస్కార ప్రసంగంలో ఆయన పేరును ప్రముఖంగా ప్రస్తావించ దం గమనార్హం.సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతి లోని నీలం రంగు ఎక్కువగా పరిక్షేపం చెంది మన కంటికి చేరడం వల్లనే సముద్రం నీలంగా కనిపిస్తుంది ఇది రామన్ ఎఫెక్ట్ ఫలితం. “కాంతి కిరణాలు ఒక ద్రవ పదార్థంపై పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం చెందుతుంది. అంటే కాంతి కిరణాల్లోని ఫోటాన్ కణాలు, ద్రవ పదార్థాల పరమాణువులపై పడి పరిక్షేపం చెందుతాయి. చాలా ఫోటాన్లు పడేటప్పటి పౌనఃపున్యంలోనే చెదిరిపోతే, కొన్ని ఫోటాన్లు మాత్రం అంతకు తక్కువ పౌనఃపున్యంతో పరిక్షేపం చెందుతాయి. అంటే పడిన కాంతిలో కొంత భాగం మాత్రం వేరే పౌనఃపున్యంతో వెనుదిరుగుతుంది. ఇదే రామన్ ఎఫెక్ట్. దీని ద్వారా రసాయనిక పదార్థాలలో అణు, పరమాణు నిర్మాణాల పరిశీలన చేయవచ్చు. పలు పరిశ్రమల్లో కృత్రిమ రసాయనిక సమ్మేళనాలను కూడా పరీక్షించవచ్చు. భారతదేశంలోనేగాక ఆసియా ఖండంలోనూ నోబెల్ అందుకున్న మొదటి శాస్త్రవేత్త సర్.సి.వి రామన్. భౌతిక శాస్త్రంలో 'రామన్ ఎఫెక్ట్'కుగానూ ఆయనకు 1930లో నోబెల్ బహుమతి లభించింది. అనంతరం 1954లో భారత ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించింది. అతను 82 సంవత్సరాల వయస్సులో 21 నవంబర్ 1970న తెల్లవారుజామున సహజ కారణాలతో మరణించాడు.రామన్ పరిశోధన ఫలితాన్ని ధృవపరిచిన రోజును (ఫిబ్రవరి 28) జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోంది.ప్రముఖ బెనారస్ హిందూ యూనివర్శిటీకి రామన్ శంకుస్థాపన చేశారు.1947లో సీవీ రామన్‌ను కేంద్ర ప్రభుత్వం మొదటి జాతీయ ప్రొఫెసర్‌గా నియమించింది.లెనిన్ శాంతి పురస్కారం, హ్యూస్ పురస్కారం, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ కూడా రామన్‌ను వరించాయి. నేటికి వైద్య రంగంలో మందుల విశ్లేషణకు రామన్ ఎఫెక్ట్‌నే వినియోగిస్తున్నారు.

# నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం




జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నవంబర్ 7న నిర్వహిస్తారు, క్యాన్సర్ వ్యతిరేకంగా పోరాటంలో ముందస్తుగా ఈ వ్యాధిని గుర్తించడం, నివారణమరియు చికిత్స యొక్క ప్రాముఖ్యతను ముఖ్యంగా తెలియజేస్తారు. భారతదేశ మాజీ కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ క్యాన్సర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ 2014లో ఈరోజునుప్రారంభించారు. అందరికీ స్ఫూర్తినిచ్చేందుకు సమాజంలో క్యాన్సర్ వ్యాధి బారిన పడి బతికిన వారి నిజ జీవిత కథలు మనకుచాలా ఉన్నాయి. మిలియన్ల మందిని ప్రేరేపించిన అలాంటి నిజ జీవిత ఉదాహరణ భారత క్రికెటర్ యువరాజ్ సింగ్ కథ. అతను నవంబర్ 2011లోమెడియాస్టినల్ సెమినోమా అనే అరుదైన ఊపిరితిత్తుల క్యాన్సర్తో బాధపడుతున్నాడు. ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్లో అతని అద్భుతమైన ప్రదర్శన తర్వాత ఇది అందరిని షాకికి గురి చేసింది. యువరాజ్ ఈ శారీరక భావోద్వేగ పోరాటాన్ని ఎదుర్కొన్న విధానం చాలా మందికి స్ఫూర్తినిస్తుంది.నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త మేడమ్ క్యూరీ జయంతి సందర్భంగా నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1867లో పోలాండ్‌లోని వార్సాలో జన్మించిన మేరీ క్యూరీ రేడియం మరియు పోలోనియం ఆవిష్కరణకు మరియు క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాటంలో ఆమె చేసిన అపారమైన కృషి గుర్తుండిపోతుంది. ఆమె చేసిన కృషి క్యాన్సర్ చికిత్స కోసం అణుశక్తి మరియు రేడియోథెరపీ అభివృద్ధికి దారితీసింది. భారతదేశం 2014 నుండి జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పాటిస్తోంది.ఈ రోజు క్యాన్సర్ నివారణ, గుర్తింపు మరియు చికిత్స గురించి ప్రజలలో అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ నుండి వచ్చిన డేటా ప్రకారం , ప్రతి సంవత్సరం సుమారు 800,000 కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతాయని భావిస్తున్నారు, పురుషులలో వచ్చే అన్ని క్యాన్సర్లలో పొగాకు సంబంధిత క్యాన్సర్లు 35?50% వరకు మరియు స్త్రీలలో 17% వరకు ఉన్నాయి.

# ఇల్లంద గ్రామంలో క్షుద్రపూజలు

వరంగల్ వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని నిర్మానుష్య ప్రాంతంలో నిన్న కార్తీక పౌర్ణమిని కావడంతో చుట్టు చెట్ల మధ్యన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసి దీపం కలశం తో ఎదో జంతువుని బలిహారణ చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. గతంలో కూడా ఇలానే జరిగినప్పటికీ అధికారులు ఇటుగా దృష్టి పెట్టడం లేదు. వరస క్షుద్ర పూజలతో గ్రామంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# గుళ్లను కూల్చివేసిన దుండగులు స్థానికుల ఆందోళన



గోదావరిఖనిలో పలు చౌరస్తాలో దారి మైసమ్మ గుళ్లను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేసారు. మైసమ్మ గుళ్ళ కూల్చివేతపై స్థానికులు ఆగ్రహంతో ఆందోళన కు దిగారు. దైవ భక్తితో ఏర్పాటు చేసుకున్న గ్రామ దేవతల గుళ్లను కూల్చివేయడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా అనాదిగా తమ ఆరాధన స్థలంగా ఉన్న గుళ్లను అకస్మాత్తుగా కూల్చివేయడం వెనుక ఎవరు ఉన్నారో తెలియడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ ఘటనపై అధికారులు తక్షణమే దర్యాప్తు చేపట్టి బాధ్యులన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హవేలి ఘనపూర్ లో తుపాకీ కలకలం



మెదక్ హవేలి ఘనపూర్ లో తుపాకీ కలకలం రేపింది. ఒక భూమి విషయంలో హైదరాబాద్ కి చెందిన హరినాథ్, హవేలి ఘనపూర్ కి చెందిన ఎల్లం మధ్య గొడవ జరిగింది. కోర్టు పరిధిలో కేసు ఉండటంతో పంట కోయడానికి ఎల్లం కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నాడు. ఇదే విషయంలో ఎల్లం, హరినాథ్ మధ్య గొడవ జరుగుతుండగా గన్ తో హరనాథ్ అనుచరులు బెదరించారు. బాధితుడు గన్ లాక్కొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ప్రత్యర్థులు అక్కడి నుంచి పరార్ అయ్యారు. చివరకు అది డమ్మీ గన్ గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై సీఐ జార్జ్ మాట్లాడుతూ ఘటన స్థలంలో లభ్యమైన గన్ ఒరిజినల్ కాదు డమ్మీ. ఒరిజినల్ గన్ లా ఉందని ఫ్లిప్ కార్ట్ లో తీసుకున్నారు. ఈ డమ్మీ గన్ నుంచి మంటలు వస్తాయి. భూ వివాదం కారణంగా ఈ ఘటన జరిగింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# జూబ్లీ హిల్స్ లో మంత్రుల సతిమణుల ప్రచారం



హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు ఇంటింటా బొట్టు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మినిస్టర్ పొన్నం సతీమణి మంజుల, మినిస్టర్ వాకిటి శ్రీహరి సతీమణి లలిత, నవీన్ యాదవ్ సతీమణి వర్ష తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కొరకై ఈ రోజు వెంకటగిరి లో డోర్ టు డోర్ ఇంటింటా బొట్టు పెట్టి ప్రచారం చేసారు.

# భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
## వరిపంట నష్టానికి ఎకరానికి రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి
## కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



చొప్పదండి మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మాజీ సుంకె రవిశంకర్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులతో కలసి గురువారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ సుమిత ప్రమేలా కు చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వినతి పత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..గత వారం రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా చొప్పదండి నియోజకవర్గంలో వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదన్నారు.రైతులు ఇంత అరిగోస పడుతున్న జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్వయంగా ఆయనే సివిల్ సప్లై మంత్రిగా ఉండి కూడా, కనీసం ఒక్క రివ్యూ కూడా పెట్టిన దాఖలు లేవని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు ప్రజలతో రైతులతో మమేకమై స్థానిక సమస్యల పట్ల పూర్తిగా అవగాహనతో ఉండి ఎప్పటికప్పుడుపర్యవేక్షించేవారన్నారు. ఇప్పుడు ఎన్నికైన చొప్పదండి శాసనస భ్యుడు ఎక్కడుంటాడో ఎవరికి తెలియదని అన్నారు.ప్రజలు మిమ్మల్ని గెలిపించింది, ఇందుకేనా అని ప్రశ్నించారు.గత రెండు సంవత్సరాల నుండి రైతుల పట్ల ఇదే తంతు కొనసాగడం బాధాకరమని అన్నారు.చొప్పదండి నియోజకవర్గంలో 300 పైచిలుకు కొనుగోలు సెంటర్లు ఉంటే, ఇప్పటివరకు పది నుండి పదిహేను శాతం వరకే సెంటర్లు ప్రారంభోత్సవం జరిగినాయి అని, అన్నారు.దయచేసి ఇప్పటికైనాజిల్లా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంట నష్టం అంచనా వేసి, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. తడిసిన వరి ధాన్యాన్ని కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.వడ్లకు నల్లగింజ, తేమ ఉన్నా, రైస్ మిల్లర్లు వెనక్కి పంపకుండా కొనుగోలు చేయాలని, పత్తి రంగు మారినా, మ్యాచర్ తో సంబంధం లేకుండా సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం బీ ఆర్ ఎస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ ని బలోపేతం చేయడమే లక్ష్యం

## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి



నందవరం ఎమ్మిగనూరు అసంబ్లీ బిజెపి కార్యకర్తలతో గురురాజ్ దేశాయ్ నెట్వర్క్ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు గురురాజ్ దేశాయ్ మరియు జిల్ల కార్యదర్శి దయసాగర్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.. బిజెపిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి పేర్కొన్నారు.సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు ప్రతి కార్యకర్త ఇంటింటికో సభ్యత్వం చేయించాలన్నారు, రాబోయే స్థానిక ఎన్నికలలో సత్తా చాటేలా బిజెపి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి దయసాగర్, బిజెపి మాజీ ఉపాధ్యక్షులు బి ల్ నారాయణ, మాజీ కౌన్సిలర్ శిల్పీ బాస్కర్, పట్టణ బిజెపి నాయకురాలు మాధవి లత, పద్మవతి మాజీ సర్పంచు మరియు ఒ.ఒ.అ కాలవ చైర్మన్ రామన్న గౌడు, బిజెపి నందవరం మండల అధ్యక్షులు రాజశేఖర్ స్వామి, నందవరం సినియర్ నాయకులు టీవి మెకానిక్ శ్రీనివాసులు, నారాయణ, మండల ఉపాద్యాయులు హలహర్వి భీమన్న, నాగలదిన్నె బిజెపి నాయకులు దస్తగిరి, మిట్టసోమపురం రామలింగప్ప, పరుశురాముడు, ౫ఆ కాలని బిజెపి నాయకులు కె శివ, డానియల్, రజక బిజెపి నాయకులు హనుమన్న, ఉరుకుందు, వీరేశ, బిజెపి మైనారిటి నాయకులు సుభాన్, అబ్దుల్, మినల్లా, గని, విక్టర్, పెయింటర్ శ్రీను, సోషల్ మీడియ కన్వినర్ దండు వీరేష్ మరియు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నాడు, నేడూ, ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీ

### దగదర్తిలో మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాలకు నివాళులు అర్పించిన మంత్రి లోకేష్

### కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి

### మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబానికి అండగా నిలిచి రాజకీయంగా పైకి తీసుకువస్తామని హామీ

దగదర్తి: నాడు, నేడూ, ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీనే అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం దగదర్తిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఆగ్రోస్ కార్పోరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుని కుమారుడు భానుచందర్ చిత్రపటాలకు పూలదండ వేసి మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. సుబ్బానాయుడు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ కేవలం ఒక్క తెలుగుదేశం పార్టీకే బలమైన కార్యకర్తలు ఉన్నారు. ఆ పసుపు జెండా చూస్తేనే తెలుగుదేశం కార్యకర్తలకు ఒక ఎమోషన్. మొన్నటి మహానాడులో కూడా కార్యకర్తే మా అధినేత అని ప్రకటించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. నాడు, నేడూ, ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిలబడేది తెలుగుదేశం పార్టీ. 2014లో కార్యకర్తల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటుచేశాం. ఇప్పటికే కార్యకర్తల సంక్షేమం కోసం రూ.135 కోట్లు ఖర్చుచేయడం జరిగింది. అంతేకాకుండా గతంలో ఫ్యాక్షన్ దాడుల్లో చనిపోయిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్ లో ఓ మోడల్ స్కూల్ ఏర్పాటుచేసి కార్పోరేట్ విద్య అందిస్తున్నాం. అందులో చదువుకున్న వారు ప్రయోజకులుగా మారారు. నా యువగళం పాదయాత్రలో కూడా కళ్లారా చూశా. ఆనాడు ప్రభాకర్ అన్నను వారి పిల్లల ముందే నరికి చంపితే.. పిల్లలను పార్టీ చదివించింది. వారు డెలాయిట్ లో, యాక్సెంచర్ కంపెనీల్లో పనిచేసే పరిస్థితి.

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్రయాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కావలి పర్యటనకు బయలుదేరిన మంత్రి నారా లోకేష్ కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా స్వాగతం పలికారు.

# హుజురాబాద్ లో వేస్ట్ బేస్డ్ డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దు చేయాలి

### బీసీ జేఏసీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్

### హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేత.



హుజురాబాద్ వద్ద వేస్ట్ బేస్డ్ డంపింగ్ యార్డ్ నిర్మాణంకొరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వము టెండర్ నోటీసు జారీ చేసియున్నారు. ఇట్టి డంపింగ్ యార్డ్ నిర్మాణం వలన హుజురాబాద్ పరిసర ప్రాంతాలలో వాతావరణ కాలుష్యం ఏర్పడి ఇక్కడి ప్రజలు, జీవరాసులు తీవ్ర అనారోగ్యానికి గురి కాబడే అవకాశం ఉన్నందున ఇట్టి డంపింగ్ యార్డ్ నిర్మాణము రద్దు కొరకు గురువారం రోజు బీసీ జేఏసీ,బీసీ ఆజాది ఫెడరేషన్, ప్రజాసంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కింసారపు సమ్మయ్య హుజరాబాద్ మెమోరాండం అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, సందేల వెంకన్న మాట్లాడుతూ.. ఇక్కడి పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకో వలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నదని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ ఇబ్బంది కలిగించే ఇటువంటి వేస్ట్ బేస్డ్ డంపింగ్ యార్డ్ నిర్మాణం రద్దు కొరకు మున్సిపల్ కమిషనర్ హుజురాబాద్ అడ్మినిస్ట్రేషన్ మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వం కు తగు సిఫారసు చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణము జరుగకుండా చర్యలు గైకొనబడునట్లు చూడగలరని విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రజాసంఘాల నాయకులు ఆకుల సదానందం, కొలిపాక శంకర్, బీసీ అజాది ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, బీసీ ఆజాది ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిలుక మారి శ్రీనివాస్, తాటిపాముల కనకయ్య, రామ్ సారయ్య, మహమ్మద్ ఖలీద్ హుస్సేన్, గౌరిశెట్టి సాంబయ్య, దొంత హరికిషన్, వేల్పుల రత్నం, పెద్దపేట రమేష్, మండల వీరస్వామి, భారత ప్రభాకర్, దాసరి మల్లేశం, గోస్కుల మధుకర్, గరవేణ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్2 అధికారి బోగ సతీష్ కు ఓసీ1 లో ఘన సన్మానం

కమాన్ పూర్ తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్2 పరీక్షలో 331వ ర్యాంక్ తో అర్హత సాధించి హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ డిపార్ట్మెంట్ కరీంనగర్ కార్యాలయంలో అసిస్టెంట్ డెవలప్మెంట్ అధికారిగా నియమింపబడి తాను పనిచేస్తున్న సింగరేణి సంస్థ ఆర్జి3 ఓసి1 కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్తున్న బోగ సతీష్ ను తోటి ఉద్యోగులు, కార్మిక సంఘనాయకులు, అధికారులు ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో గజమాల, శాలువాలు, బహుమతులు, జ్ఞాపికగా అందజేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంటెక్ చదివి సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ గా 2016లో అర్జీ2 ఏరియా వర్క్షాప్ లో నియమింపబడి సంవత్సరంన్నర క్రితం ఓసి1 కు బదిలీపై వచ్చి తోటి ఉద్యోగులతో కలిసిమెలిసి, అందరి మన్ననలను పొంది, సింగరేణి దగ్గర ప్రాంతంలోనే పోస్టింగ్ ఇవ్వడం సంతోషకరమని, వారి సేవలను కొనియాడుతూ, గతంలో వారు సిండికేట్ బ్యాంకు పిఓగా, కేడీసీసీ బ్యాంకు క్లర్కుగా, రైల్వే అసిస్టెంట్ లోకో పైలెట్ గా.. పలు ఉద్యోగాలకు అర్హత సాధించి, నియమింపబడి గ్రూప్1 పరీక్ష ఫలితాల అర్హతకు దగ్గరగా వచ్చిన తన కోరిక త్వరలో నెరవేరాలని, తాను పద్మశాలిగా, వారి కులానికి సంబంధించిన విభాగంలోని అధికారిగా నియమింపబడిన సందర్భంగా సంతోషంగా పనిచేస్తూ, మరింత పేరు తెచ్చుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి రావు, గని మేనేజర్ రావుల పాపయ్య, రక్షణ అధికారి అజయ్ కుమార్, అదనపు మేనేజర్ ఎల్.వినాయక్, ఏఐటీయూసి పిట్ కార్యదర్శి డి. తిరుపతి రావు, టీబీజీకేఎస్ నాయకులు అల్లం తిరుపతి, ఐఎన్టియుసి నాయకులు రమేష్ రావు, కొండాల్ రెడ్డి, రామచంద్ర రావు, రఘునాథ్, రత్నం, వెంకటరమణ, భోగ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థలో పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి.

### ఏఐటియుసి సివిల్ డిపార్ట్ మెంట్ పిట్ సెక్రటరీ దాసరి శ్రీనివాస్ డిమాండ్.

### సింగరేణి అధికారికి వినతి పత్రం అందజేత.

రామగుండం: సింగరేణి సంస్థ లో సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అర్జీ వన్ ఏరియా ఎఐటియుసి సివిల్ డిపార్ట్ మెంట్ పిట్ సెక్రటరీ దాసరి శ్రీనివాస్డిమాండ్ చేశారు. అర్జీ వన్ సివిల్ డిపార్ట్ మెంట్ కార్యాలయం లో గురువారం మేనేజ్ మెంట్ ట్రైనీ (సివిల్) ప్రణీత్ కుమార్ కు అయన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎఐటియుసి యూనియన్ కేంద్ర నాయకత్వ ఆదేశాలమేరకు సింగరేణి కార్మికుల సమస్యలనుపరిష్కరించాలని సింగరేణి అధికారి కి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేసి, పాత విధానంలోనే ఇన్వాలిడేషన్ నిర్వహించాలని కోరారు.మెడికల్ ఫిట్ ఐన డిపెండెంట్ లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలన్నారు.సింగరేణి ఉద్యోగుల సొంత ఇల్లు పథకం ను అమలు చేయాలన్నారు. అలవెన్స్ (పెర్క్స్) పై విధించే ఆదాయపన్ను (ఇన్కమ్ టాక్స్)ను కోల్ ఇండియా మాదిరిగా యాజమాన్యమే భరించాలని అయన డిమాండ్ చేశారు.క్రమశిక్షణ చర్యల కోసం 150 మస్టర్లు చేయాలనే సర్క్యులర్ ను యాజమాన్యం వెంటనే రద్దు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి నెలా అండర్ గ్రౌండ్ వారికి 16 మస్టర్లు, సర్ఫేస్ లో 20 మస్టర్లు లేని వారికి కౌన్సిలింగ్ జరిపే విధానాన్ని రద్దు చేయాలని కోరారు.దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను తక్షణమే నిర్వహించాలన్నారు.కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు బిట్టి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ అటికేటి రాజు, మేకల లింగయ్య,దొరగాండ్ల మల్లయ్య, శ్రీనివాస్ రావు(క్లర్క్), రామక్రిష్ణ రెడ్డి,తోట చెంద్రయ్య, మహేశ్, బిక్షపతి, రవీందర్, రమేష్,మొగిలి తదితరులు పాల్గొన్నారు

# కీలకంగా మారిన డేటా ఆధారిత పాలన

### జనవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్

### సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు న మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు...వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు హజరయ్యారు.

సీఎం డేటా ఆధారిత పాలనపై సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు.

చంద్రబబాబు మాట్లాడుతూ దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యత కావాలి. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందాం. అంతా కలిసి కట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫాన్ను టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగాం. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని అన్నారు. క్వాంటం కంప్యూటర్ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నాం. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్ధంగా వనరుల్ని వినియోగించగలుగుతున్నాం. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నాను. నెలలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచిస్తున్నాను. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉంది. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తాం. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నాం. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

# మంథని మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల బెడద

### -ప్రజల ప్రాణాలతో చెలగాటం...పట్టించుకోని మున్సిపాలిటీ



మంథని మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వీధి కుక్కలు సైర విహారం చేస్తూన్నాయి.పెద్ద ఎత్తున గుంపులుగా తిరుగుతు రాత్రి అంతా మొరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా దారిన వెళ్తున్న వారిని కరుస్తూ పలువురిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా నిన్న మంథని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు రజక వీధిలో కొల్లూరి సమ్మయ్య మరియు అనీల్ అనే యువకుడిపై ఓ వీధి కుక్క దాడి చేసి కాళ్ల పిక్కలను కొరికింది. దాంతో భాదితులు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసుకొని చికిత్స పొందుతున్నారు. మంథని మున్సిపల్ పరిధిలో గల పలు వార్డుల్లో అనేక వీధులతో పాటు 7వ వార్డు లోని భగత్ నగర్, ఉస్మాన్ పుర, దొంతుల వాడ, రావుల చెరువు కట్ట, విశ్వ బ్రాహ్మణ వీధి, రజక వాడ లో పెద్ద ఎత్తున కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తు, ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వీధి కుక్కల విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు, మంథని మున్సిపల్ కమిషనర్ కు గత ఆగస్టు నెలలో ఫిర్యాదు చేసిన వీధి కుక్కల అదుపునకు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం విచారకరం. ఇప్పటికే వీధి కుక్కల అదుపునకు దేశ స్థాయిలో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకొని దేశంలో ఉన్న పలు రాష్ట్రాలకు వీధి కుక్కల అదుపు కోసం పలు మార్గదర్శకాలు, ఆదేశాలు ఇటీవల జారీ చేయగా, దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేసింది. కాగా మంథని మున్సిపాలిటీలో మాత్రం రోడ్లపై పశువుల అదుపు కోసం పది వేల రూపాయలు ఫైన్ అంటూ ప్రకటనలు జారీ చేస్తూ హంగామా చేస్తున్న స్థానిక అధికారులకు మాత్రం ప్రజలకు ప్రాణసంకటంగా మారిన కుక్కలు, కోతుల విషయంలో నిర్లక్ష్యం వహించడంపై పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఫీజు పోరు... కాలేజీల బంద్ కు సంఘీభావంగా ఏఐఎస్ఎఫ్ ర్యాలీ

## కరీంనగర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇల్లు ముట్టడికి యత్నం అడ్డుకున్న పోలీసులు, తోపులాట, స్వల్ప ఉద్రిక్తత ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డితో సహా పలువురు అరెస్టు

ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ స్కాలర్షిప్ ల కోసం కాలేజీల బంద్ లో భాగంగా కరీంనగర్ లో ఏఐఎస్ఎఫ్ ఆందోళన స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఫీజు పోరులో భాగంగా కళాశాలల బంద్ కు సంఘీభావంగా ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు కరీంనగర్ లో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి మంత్రి పొన్నం ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి పొన్నం ఇంటిని ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు మధ్య తోపులాట చోటుచేసుకుంది. స్వల్ప ఉద్రిక్తతకు దారి తీయడంతో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డితో పాటు పలువురినీ పోలీసులు అరెస్టు చేశారు. ఏకకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు రాక గత నాలుగు రోజులుగా కళాశాలల బంద్ తో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ తీసుకువస్తే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానికి తూట్లుపొడిచి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులు విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మల్కాపూర్ లో ఆర్టీయే తనిఖీలు

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపూర్ లోని ఫిట్నెస్ సెంటర్ వద్ద స్పెషల్ డ్రైవ్లో భాగంగా భారీ ఓవర్ లోడ్ తో వెళ్తున్న వాహనాలు ఫిట్నెస్ లేని వాహనాలు ఆర్టీవో అధికారులు చెకింగ్ చేసారు.

ఆర్టీవో అధికారులు మాట్లాడుతూ... వికారాబాద్ లో జరిగిన జరిగిన ప్రమాదంలో 19 మంది మృతి ఘటనలో భాగంగా,,రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని... ఈరోజు చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం ఫిట్నెస్ సెంటర్ వద్ద జ విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఓవర్ లోడ్ తో వెళ్తున్న వాహనాలు ఫిట్నెస్ లేని వాహనాలను తనిఖీలు చేయడం జరిగిందని, ఈ తనిఖీలో రెండు ఓవర్ లోడ్ టిప్పర్లను, ఫిట్నెస్ లేని బొలెరో, టిప్పర్ను పట్టుకున్నట్లుగా అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై ఓవర్ లోడ్ తో వెళ్తున్న ఫిట్నెస్ లేని వాహనాలు జాతీయ రహదారి పై నడపకూడదని, ఎవరైనా నియమాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కుకునూరుపల్లి జడ్పీ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



సిద్దిపేట కుకునూరు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు వంట గదిలో ఆహార పదార్థాలను పరిశీలించారు మెనూ ప్రకారమే ఆలుగడ్డ టమాటా పప్పు, బిర్యాని రైస్ వండినట్లుగా వంట సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తూ బిర్యాని మరియు కూరల్లో నాణ్యత పెంచాలని విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో పిల్లల హాజరు బియ్యం వంట సరుకులు అందించాలని వంట ప్రక్రియను తనికి చెయ్యాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పాఠశాల లోపల వరండాలో ఉండకుండా, బయట మైదానంలో ఆకులు లో శుభ్రంగా లేదని పాఠశాల ఇంత అపరిశుభ్రంగా ఉంటే ఏం డ్యూటీ చేస్తున్నారని ప్రిన్సిపల్ స్కావెంజర్స్ పైన ఆగ్రహం వ్యక్తం చేసి యాక్షన్ తీసుకోవాలని డి ఈ ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

కొండపాక మండల లోని తిమ్మారెడ్డి పల్లి లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంట గదిలో బిర్యానీ, ఆలుగడ్డ టమాటా కూర చేసినట్లుగా వంట సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. పాఠశాలలో పిల్లల హాజరు బియ్యం వంట సరుకులు అందించాలని వంట ప్రక్రియను తనికి చెయ్యాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, చదువు విషయంలో ఎలాంటి లోటు కలగకుండా చూసుకోవాలి. విద్యార్థులతో భోజన ప్రక్రియను పరిశీలిస్తూ అన్ననీ, కూర వదలకుండా తినాలని అన్నం పరబ్రహ్మ స్వరూపం అని సూచించారు. ఈ వయసులో బాగా తినాలని శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసిక ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు.

అనంతరం ప్రాంగణంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని బాలింతలకు, పిల్లలకు అందించాల్సిన భోజనం, స్నాక్స్, బాలమృతం ఇతరత్ర అన్ని వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

# సేవా నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేయాలి

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల, పదోన్నతి బదిలీపై జగిత్యాల జిల్లాకు వచ్చిన హెడ్ కానిస్టేబుళ్లు జిల్లా ఎస్పీ ని వ ం ర్యా ద ప్ ూ ర్వ క ం గా కలిశారు.పదోన్నతి బదిలిలో భాగంగా నిజామాబాద్ ,అదిలాబాద్ జిల్లాల నునీడి జగిత్యాల జిల్లా కు బదిలీ అయిన 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు గురువారం జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేస్తూ,పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

# సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన



జగిత్యాల, ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం కల్పించాలన్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే దిశగా విస్తృత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. ఇందులో బాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఉదయం వాకింగ్ చేసే ప్రజలను కలుసుకుని, సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో ఉదయం వాకింగ్కు వచ్చే ప్రజలను పోలీసులు ప్రత్యక్షంగా కలుసుకుని, సైబర్ మోసాల నుండి రక్షించుకునే విధానాలపై వివరించారు. ప్రజలు ఆన్లైన్లో ఆర్థిక లావాదేవీలు చేయడం, షాపింగ్, ట్రేడింగ్, సోషల్ మీడియా ఉపయోగించడం వంటి సందర్భాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ మోసగాళ్లు పలు రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని, ఫోన్ కాల్స్, ఫేక్ వెబ్సైట్లు, సోషల్ మీడియా లింక్స్, ఆన్లైన్ ఇన్వెస్ట్మెంట్స్ ద్వారా వ్యక్తిగత వివరాలు దొంగిలించి ఖాతాల్లో నుంచి డబ్బు తీసుకుంటున్నారని తెలిపారు. సైబర్ మోసల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద లింక్స్పై క్లిక్ చేయరాదని,బ్యాంకు వివరాలు ఓటీపీ ఆధార్,పాన్ నంబర్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వరాదని,ఏదైనా అనుమానం కలిగితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ 1930 కు కాల్ చేయాలి, లేదా లిలిలి.ఇ.ఎవతీఇతీతిఎవ.ణనీల.తిని వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# బీసీ రిజర్వేషన్లు సాధించేదాకా పోరాటం ఆగదు

## – బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష



పెద్దపల్లి రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళుతున్నామని జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష తన దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. బీసీ మౌన దీక్షతోపాటు పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ నూతన కమిటీ నియామకం చేపట్టారు. గురువారం పట్టణంలోని అమర్ నగర్ చౌరస్తా వద్ద మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ బీసీలందరూ అంతర్గతంగా తమ బలాన్ని గుర్తించుకుని, ఐక్యతను చాటాలని, ఒక్కతాటి మీదకి వచ్చి గల్లీ నుంచి ఢిల్లీ వరకు తమ గొంతును బలంగా వినిపించాలని పిలుపునిచ్చా రు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాజకీయ ఒత్తిడి పెంచాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కొందరు తమ హక్కులను కాలరాసేందుకు, ఎన్నికల టిక్కెట్లు, చిన్న ప్రయోజనాల పేరిట ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. బీసీలు అందరూ మేల్కొని, 42 శాతం రిజర్వేషన్లను తామే సాధించుకునే శక్తిని నిరూపించాలని ఉద్ఘాటించా రు. ఈ ఉద్యమాన్ని గ్రామ,గల్లీ స్థాయి నుంచి ప్రతి గడపకూ తీసుకువెళ్లేందుకుగాను, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నల్లవేణి శంకర్,జిల్లా మహిళా కన్వీనర్ గా సిరవేన స్వప్న, జిల్లా కన్వీనర్లుగా శైలేంద్ర కొమరయ్య యాదవ్, దెల్ల భూమేష్, గుడ్ల సమ్మయ్య, మీడియా ఇన్చార్జిగా అబ్దుల్ మాలిక్ ను నియమించినట్లు ప్రకటించారు. ఈ మేరకు వారికి దాసరి ఉష నియమాక పత్రాలను అందజేశారు. రిజ ర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు ఈ పోరాటం కొనసాగుతుంద ని ఆమె స్పష్టం చేశారు. ఈ మౌన దీక్షకు జిల్లా దళిత సంఘాల నాయకులు కూడా పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ నాయకులు నల్లవేణి శంకర్,శిలారపు పర్వతాలు యాదవ్, సలేంద్ర కొమురయ్య, సిలవేరు స్వప్న,మంద భాస్కర్ యాదవ్, శివంగారి సతీష్,కావేటి రాజగోపాల్, బొంకూరి సురేందర్ సన్నీ, ఆక్కపాక తిరుపతి, తాండ్ర సదానందం, కంకటి శ్రీనివాస్, భూమేష్, మిట్టపల్లి శ్రీనివాస్, పోసాని శ్రీనివాస్, జ్యోతి, సిపల్లి రవీందర్ తోపాటు తదితర బీసీ, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్ దర్యాప్తు చేస్తున్నాం

## సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

మంగళగిరి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్ పై గుంటూరు జిల్లా సబ్ కలెక్టర్ సంజనా సిన్హా స్పందించారు. యూనివర్సిటీలో దాదాపుగా 300 మంది అస్వస్థత గురైనట్టుగా గుర్తించాం. వారిలో కొంతమందికి డయేరియా లక్షణాలు, కొంతమందికి వాంతులు విరోచనాలతో అస్వస్థత గురయ్యారు. దానికి సిఆర్డిఏ గ్రామాలనుంచి సరఫరా అవుతున్న నీటి వలన ఏమైనా జరిగిందా అనే కోణంలో కూడా దర్యాప్తు జరుపుతున్నామని అన్నారు.

యూనివర్సిటీ యాజమాన్యం ఆర్వో వాటర్నే సరఫరా చేస్తున్నట్టు తెలియజేశారు..దాదాపుగా యూనివర్సిటీలో 6,000 మంది విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.. వారిలో కేవలం 300 మందే అస్వస్థత గురవటం దానిపై పూర్తి దర్యాప్తు జరిపి కొన్ని గంటలలో నివేదికనే అందిస్తాము. నివేదిక ఆధారంగా యూనివర్సిటీకి మెమో జారీ చేయటం దానిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గతంలో కూడా ఇటువంటి ఘటనలు జరిగిన దాఖలాలు ఉన్నాయి ... నివేదిక ఆధారంగా యూనివర్సిటీకి ఎస్పీవో పంపించడం జరుగుతుందని అన్నారు.

# ఉద్యానవనాలను వాకర్స్, సందర్శకులకు అనుగుణంగాతీర్చిదిద్దుతాం:ఎమ్మెల్యే నానాజీ హామీ

కాకినాడ రూరల్, నవంబరు 05: ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్న ఉద్యానవనాలను వాకర్స్, సందర్శకులకు అనుగుణంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ హామీనిచ్చారు. పార్కుల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ స్థానిక గుడారిగుంటలోని ఆయన కార్యాలయంలో బోట్ క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీకి వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ కాకినాడ నగరంలో గల తొమ్మిది ఉద్యానవనాలలో వాకర్స్ సంఘాలు ఏర్పడి వాటి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఇప్పటికే ఆ తొమ్మిది పార్కులు అభివృద్ధి చెందాయన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అభివృద్ధి చేయాలని భావిస్తే నూతన పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. ఉద్యానవనాలను వ్యాపార అభివృద్ధికి కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే రీతిగా పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఉద్యానవనాలను కార్పొరేట్ సంస్థలకు వాణిజ్య అవసరాలకు ఇచ్చే అంశాన్ని జిల్లా కలెక్టర్, పురపాలక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. మొదటగా, ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన మొంథా తుపాను సమయంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలలో పర్యటించి ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించడంలో చేసిన కృషికి గాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సైక్లోన్ ఫైటర్ పురస్కారం అందుకున్నందుకు అభినందనలు తెలుపుతూ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, అడబాల సత్యనారాయణ, రాజా, పి. ధర్మచంద్ర రాజు, పిల్లా భీమశంకర్, ఆనాల సత్యనారాయణ, నున్న సత్యనారాయణ, సలాది గోవిందు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా అధికారుల పాక్షిక నిర్వహణ




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 6 అక్టోబరు 2025**మణికొండ మున్సిపల్ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ ఎచ్.ఏం.డి.ఏ చట్ట ప్రకారం ఏర్పాటు చేసిన సమయంలో 6054 గజాల స్థలం ప్రజా ప్రయోగాలకు వదలడం అందులో కాస్త భాగం కబ్జాకు గురికావడం స్థానికులు అట్టి స్థలం కొరకు పలు మార్లు మునిసిపల్ అధికారులకు పిర్యాదు చేయడం జగమెరిగిన సత్యం కాగా ఇప్పుడు కొంతమంది ముందుకు వచ్చి తాము మాత్రమే ఆ స్థలం కాపాడడానికి ప్రయతిస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం చూస్తుంటే వింతగా ఉన్నదని స్థానికులు అక్షర్యపడుతున్నారు.




ప్రస్తుతం హైడ్రా అధికారులు స్పందించి స్థలాన్ని కాపాడుతూ ఫెన్సింగ్ వేయడం శుభ పరిణామమే అయినను వీరు ఫెన్సింగ్ వేయడం దాదాపు 5000 గజాల స్థలం వరకే ఉన్నదని, మిగిలిన స్థలాన్ని దైవాదీనముగా ఖబ్జాకు వదలడం మరీ దారుణమని ప్రజలు వాపోతున్నారు.

ప్రజా ప్రయోగాలకు వాడవలసిన స్థలాన్ని కుప్పి తొట్టి మాదిరి చెత్తా చెదారంతో పేరుకొని పోవడం చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు గమ్మున ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనానికి మచ్చుతునక కాగా పై పెచ్చు ప్రజలు లోపలకు రావడానికి వీలు లేదని వచ్చిన ఎడల చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని హైడ్రా అధికారులు హెచ్చరిస్తూ బోర్డు పెట్టడం ప్రపంచ ఎనిమిదవ వింతగా ఉన్నదని మణికొండ భారత రాష్ట్ర సమితి స్థానిక నాయకులు ఖండించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, కుంబగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, రామసుబ్బ రెడ్డి, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, బాబు రావు, దేవి ప్రియ, బి.ఎస్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# కాంగ్రేస్ పార్టీ నాయకులు చిత్త శుద్ధి లేని మాటలు







**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 6 అక్టోబరు 2025**తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 11న జరుగుతున్న జూబ్లీహిల్స్ ఏకైక బై పోల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు చిత్త శుద్ధి లేని మాట్లాడుతూ, కాంగ్రెసుకు ఓటు వేయని ఎడల రాబోయే కాలంలో సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేయడం ద్వారా స్థానిక ప్రజల్లో భయభ్రాంతులను సృష్టిస్తున్నారని ప్రజలు తీవ్రంగా దుయ్యబట్టారు. గతంలో కల్లబొల్లి మాటలు మాట్లాడి అధికారాన్ని చేజిక్కించుకొని, నది దాటేదాకా ఓడ మల్లన్న %-% దాటిన తరువాత బోడీ మల్లన్న అన్న చందాగా 6 గ్యారంటీలను అటకపై వేసి 420 హామీలను అనగద్రొక్కడం జరిగినది. అట్లాగే గత సంవత్సరం కంటోన్మెంట్ లో జరిగిన బై పోల్ లో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని, ప్రభుత్వ ఉత్తర్వులు చూపించి ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చకుండా కనుమరుగైన విషయాన్ని జూబిలీ హిల్స్ ప్రజలు తేటతెల్లంగా గుర్తు చేసుకుంటున్నారు. కావున ఇక్కడ జూబ్లీహిల్స్ ప్రజల ముందు అలాంటి పప్పులు ఉడకవని స్థానిక ప్రజలు స్పష్టం చేస్తున్నారు. గురువారం రోజున షేక్పేట పోలింగ్ కేంద్ర పరిసర ప్రాంతాలలో మణికొండ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పర్యవేక్షణలో బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు కోసం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా బూత్ 29లో స్థానికులు వెంకటేశ్, రాములు, కృష్ణా, యాదగిరి, ప్రభాకర్, సీనియర్ నాయకులు కుంబగళ్ళ ధనరాజ్, అందె లక్ష్మణ్ రావు, వెంకటేశ్, గడ్డమీది శ్రీనివాస్, కిరణ్ తదితరులు బూత్ 25 లో స్థానికులు మల్లికార్జున్, రవికుమార్, ఫయాజ్, విగ్నేష్, ముషీరాబాద్ నాయకులు ఎస్టీ ప్రేమ్, బి.కిరణ్ కుమార్, మణికొండ జనరల్ సెక్రటరీ గుట్టమీది నరేందర్, యాలాల కిరణ్, ఎం.బాబురావు తదితరులు బూత్ 26 లో స్థానికులు వాసవి, పుష్ప, రాధిక, అశోక్, ముషీరాబాద్ జ్యోతి, ప్రభుస, మణికొండ సుమనళిని, దేవి ప్రియా తదితరులు విస్తృత ప్రచారంలో పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో తడిసిన ధాన్యం
## జాతీయ రహదారిపై ఆరబెడుతున్న రైతన్నలు
## ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 6 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఉమ్మడి చౌటకూరు మండల పరిధిలోని, పలు గ్రామాల్లోని రైతులు, నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు పక్కన, రైతులు తడిసిన వరి ధాన్యాలను ఆరబెడుతున్నారు, ఈ ధాన్యాలు నల్లటి కార్పెంట్స్ తో,కప్పబడి ఉండడంతో, రాత్రి వేళలో వాహనదారులు వాటిని గుర్తించలేక, ప్రమాదాల బారిన పడుతున్నారు , ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు,ప్రమాదాలకు ఎక్కువ గురవుతున్నారు, స్థానికుల వివరాల ప్రకారం, గతంలో కూడా ఈ సమస్య వలన, కొన్ని ప్రాణాపాయ సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ, వీటి విషయమై అధికారులు ఎవరూ పట్టించుకోలేదు, ఇప్పటికై న నేషనల్ హైవే అథారిటీ అధికారులు, తగు జాగ్రత్తలు తీసుకోకపోతే, జిల్లా కలెక్టర్ కు వెంటనే సమాచారం ఇచ్చి, నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు పక్కన, వరి ధాన్యం కుప్పలు ఆరబోయొద్దని, జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తామని వాహనదారులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు, సింగూర్ చౌరస్తా నుండి, పుల్కల్ వరకు ఉన్న, సింగిల్ లెన్ రోడ్లో, ఒకవైపు వరి ధాన్యాల ఆరబోత, బండ్ల వలన వాహనదారులు, తప్పించుకొని పోవాల్సి వస్తుంది, దీనివలన రాత్రి సమయాల్లో, ప్రమాదాలకు అవకాశం మరింత పెరుగుతోంది, వీటి గురించి పోలీసు వారు, రోడ్లపై వరి ధాన్యాన్ని ఆరబోయొద్దని, ఎన్నిసార్లు చెప్పినా, రైతుల తీరు మారడం లేదు, గ్రామస్తులు రైతులు, వరి ధాన్యాన్ని రోడ్ల పక్కన కాకుండా, ఐకెపి సెంట్రర్లు లేదా, అధికారిక కొనుగోలు కేంద్రాల్లో, నిలువ చేసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, వెంటనే సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న, వరి ధాన్యాలను తొలగించి, అందరూ భద్రంగా

# విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కరించకుంటే ఆందోళనలు

**TGUEEU-CITU ఖమ్మం జిల్లా జనరల్ బాడీలో యూనియన్ నాయకులు పిలుపు**

**రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం ప్రసాద్**











**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 06 (ప్రజాబలం)** ఖమ్మంవిద్యుత్ శాఖ లో అనేక సమస్యలు ఉన్నాయని వీటి ద్వారా ఉద్యోగులు, కార్మికులు క్రింది స్థాయి కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వీటిని తక్షణం పరిష్కరించుకుంటే ఆందోళన చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలియపరిచినది బి పుష్ప రాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో ఖమ్మం జిల్లాలో క్రింది స్థాయి జూనియర్ లైన్మెన్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులు సబ్ స్టేషన్ లలో ఆపరేటర్ ఖాళీగా ఉన్నాయని దీనిద్వారా పని భారం మిగతా వారిపై పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూనియన్ తెలిపింది. కొత్త గా సబ్ స్టేషన్ నిర్మించే వాటిలో ఉద్యోగులను నియమించలేదని దీని ద్వారా కార్మికులు ఉద్యోగులు అధిక శ్రమ పడాల్సి వస్తుందని అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సెలవులు ఇవ్వకుండా కార్మికుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కమిటీ ఆరోపించినది వెంటనే వీటి స్థానంలో నియామకాలు చేపట్టకపోతే ఖమ్మం ఎస్ ఈ ఆఫీస్ ముందు ఆందోళనలు చేయనున్నట్లు కమిటీ తెలిపింది సంస్థల్లో వెంటనే అన్ని క్యాడర్ల ప్రమోషన్ ఇవ్వాలని కమిటీ డిమాండ్ చేసింది కిందిస్థాయి కార్మికులకు కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అనేక సంవత్సరాలుగా వీరు పని చేస్తున్నారని గత ప్రభుత్వా%శీ% యాజమాన్యాలు వీరికి తీవ్ర అన్యాయం చేశాయని కావున తక్షణం వీరి సమస్యల పరిష్కరించి ఉపాధి కల్పించాలని వారు విద్యుత్తు బిల్ కలెక్టర్లు అన్మాన్ కార్మికులు, మీటర్ రీడర్లు ఎస్పీఎం స్టోర్ కార్మికుల ఉన్నారని వీరికి కనీస వేతనాలు 26 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఆర్టిజన్లనే గ్రేడ్ చేంజ్ చేసి వీరిని కన్వర్షన్ చేయాలని తక్షణం ఖాళీ పోస్టర్లలో వీరిని భర్తీ చేయాలని ఆర్టిజన్ అనే పదం లేకుండా అందరిని సంస్థల్లో విలీనం చేసుకోవాలని కమిటీ విజ్ఞప్తి చేసినది కొత్తగా సెక్షన్ ఆఫీసులు డివిజన్ ఆఫీసులు రెవెన్యూ ఆఫీసులు వచ్చాయని వీటికి అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బందిని అదనపు పోస్టులు మంజూరు చేయలేదని కాళీ పోస్టులే భర్తీ చేయకుండా కార్మికులని ఇబ్బందులుపెట్టి శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని తక్షణం అదనపు పోస్టులు సాంక్షన్ ఇవ్వాలని యూనియన్ డిమాండ్ చేసినది భారీ చేరికలు యూనియన్ పట్ల పోరాటాల పట్ల ఆకర్షితులై జూనియర్ లైన్మెన్లు మీటర్ రీడర్లు అన్ మేన్ కార్మికులు బిల్లు కలెక్టర్లు అనేకమంది యూని యన్ లో చేరినారు వీరికి జిల్లా నాయకులు అధ్యక్షులు పుష్ప రాణి కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డా వెంకటేశ్వరరావు ఆర్టిజన్ల నాయకులు గంటా శ్రీనివాసరావు సత్తుపల్లి నాయకులు ఉగ్గం వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు వైరా నాయకులు రాజేష్ ఖమ్మం నాయకులు సీతయ్య సత్యనారాయణ రెడ్డి కమలాకర్ వీరికి యూనియన్ కండవా కప్పి యూనియన్ లోకి ఆహ్వానించినారు వారి కోసం యూనియన్ బలంగా పోరాడుతుందని రాబోయే రోజులలో శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల సమస్యల పరిష్కరించే వరకు నిరంతరం పోరాడుతుందని భవిష్యత్తులో జిల్లాలో ఉన్న ఉద్యోగులందర్నీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు పోరాటాలు చేయనున్నట్లు కమిటీ తెలిపింది ఈ సమావేశంలో రామయ్య లాలయ్య మధు రామకృష్ణ వీరయ్య నరేష్ మహిళా ప్రతినిధులు రాధ సంధ్య తదితరులు పాల్గొన్నారు

# సన్నవడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 06 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** చౌటకూర్ మండల కేంద్రంలో, సన్నవడ్లు కొనేందుకు, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, గ్రామ రైతులు, చౌటకూర్, మండల నాయబ్ తాసిల్దార్, శ్రీమాన్ రాజుకి, వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్లో అనేకమంది రైతులు, సన్న వడ్లు పండిస్తున్నారు కావున ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో, సన్న వరి ధాన్యం కొనేందుకు, నిరాకరిస్తున్నారని, అని అన్నారు, సన్నవడ్లకు క్వింటాల్ కు,500, రూపాయల బోనస్ ఇస్తామన్నా, రాష్ట్ర ప్రభుత్వం, సన్నధాన్యం తీసుకోకపోవడం ఏమిటని, రైతులు ఆవేదన చెందుతున్నారు, కొనుగోలు కేంద్రాలలో సన్నవడ్లు తీసుకోకపోతే, అ ధాన్యాన్ని ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నిస్తున్నారు, జిల్లా అధికారులు, వరి కొనుగోలు సెంటర్ నిర్వహకులతో మాట్లాడి, సన్నాలు కొనుగోలు చేసే విధంగా, చూడాలని కోరుతున్నారు, ఈ కార్యక్రమంలో తలారి దేవయ్య, నరేందర్ రెడ్డి, రాజు, వెంకటేష్ నరసింహారెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.....

# నవీన్ యాదవ్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ

### నవీన్ యాదవ్ ను రౌడీ అంటే సహించం
### వివిధ జిల్లాల యాదవ ప్రతినిధుల సమావేశంలో
### మల్లి బాబు యాదవ్ పుచ్చకాయల వీరభద్రం హెచ్చరిక



**ఉమ్మడి ఖమ్మం ప్రతినిధి నవంబర్ 6 (ప్రజాబలం)** జూబ్లీహిల్స్ నియోజకవర్గం చరిత్రలో రికార్డు స్థాయిలో గెలవబోయే నవీన్ యాదవ్ ను చేతగాని దద్దమ్మ లా బీసీ బిడ్డను రౌడీ అనడం సహించబోమని తెలంగాణ రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు హెచ్చరించారు హైదరాబాదులో జరిగిన తెలంగాణ రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధుల సమావేశం జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్ యాదవ్ కు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, ముక్తకంఠంతో ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు మేకల మల్లిబాబు యాదవ్, టిపిసిసి కార్యదర్శి పుచ్చకాయల వీరభద్రం యాదవ్ లు సమావేశమును ఉద్దేశించి మాట్లాడుతూ నవీన్ యాదవ్ నవ యువ ఫౌండేషన్





ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం, వారి తండ్రిగారైన చిన్న శ్రీశైలం యాదవ్ గత 40 సంవత్సరాలు నుండి తనను నమ్ముకున్న ప్రతి ఒక్కరికి, ఎలాంటి ఆపద వచ్చినా నియోజకవర్గ స్థాయిలో నేనున్నానంటూ ప్రతి ఒక్కరిని ఆదుకుంటున్న వ్యక్తులు రేపటి ఎన్నికలలో గెలిస్తే మాకు ఉనికి కూడా ఉండదనే భయం తో ప్రతిపక్షాల నాయకులు, ముఖ్యంగా బి ఆర్ఎస్ నేతలు అగ్రకుల అహంకారంతో నవీన్ యాదవ్ ను రౌడీగా ముద్ర వేసి దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని ఖండిస్తూ ప్రతిపక్షాలు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 50 లక్షల యాదవ జనాభా ఉన్నప్పటికీ ప్రస్తుతం అసెంబ్లీలో ఒక్క యాదవ ఎమ్మెల్యే లేకపోవడం చాలా దురదృష్టమని, నవీన్ యాదవ్ కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమావేశంలో దేగల రాజు యాదవ్, రేళ్ళ పద్మ, కసర బోయిన వనజ,అప్కో గజేందర్ యాదవ్, డాక్టర్ నారబోయిన నరేష్ యాదవ్, వేల్పుల చక్రధర్ యాదవ్, చింటూ, ఐలేష్ యాదవ్, గాంధీ, కడారి శివ యాదవ్ కుమార్ చౌదరి యాదవ్ నాగుల శ్రీను యాదవ్, డోకు చంద్రశేఖర్ యాదవ్ మేకల గణేష్ యాదవ్, నిర్మల్ జిల్లా నుండి గజేంద్ర యాదవ్, సిద్దిపేట జిల్లా నుండి రాజు యాదవ్, గజ్జి సూరిబాబు యాదవ్ మరియు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు

# పంచలింగాల్, తెల్ల బంగారం కంటికి కానరాక చింతిస్తున్న రైతన్న



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 6( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా :** మర్పల్లి, పంచలింగాల్ పుట్టెడు ఆశతో ఎదురు చూస్తున్న తెల్ల బంగారం కానరాక చింతిస్తున్న రైతన్న ఎన్నో ఆశలతో ఈసారి బాగా పంటలు పడతాయని పెట్టుబడి పెట్టిన లాగోడి ఫోను ఈసారి మంచి పంటలు పండితే మంచి రెండు ఎడ్లు కొందామని ఒక గేదెనుకో %శీ%దామని కళ్ళముందు ఎడ్లు ఇంటి ముందు ఆవు ఇంటి నిండా పాలు పెరుగు ఉంటాయని సంతోషించాను కానీ చెట్టులో ఇరుక్కుపోయిన ప్రతిని తీయలేక వదిలేయడానికి మనసు ఒప్పుకోలేక బాధతో పత్తి పంటను రూపు చేసుకుంటున్నామని తెలిపారు ఈసారి భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి రైతన్న ఆదుకోవాలని ఆవేదన వ్యక్తపరిచారు

# విద్యార్థులకు సైబర్ జాగరూకత దివస్ పై అవగాహన



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 6:**మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ జాగరూకత దివాస్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసమావేశంను మందమర్రి ఎస్.ఐ. రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించగా 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి ఏసీపీ కె రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి లు హాజరయ్యారు. బెల్లంపల్లి ఏసీపీ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో యువతరం ఇంటర్నెట్ వాడకంలో అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన



అవసరాన్ని నొక్కి చెప్పారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను ఎలా టార్గెట్ చేస్తున్నారో వివరించారు. అదేవిందగా ఈ అవగాహన విషయాలను కుటుంబ సభ్యులకు, స్నేహితులతో, బంధువులతో పంచుకోవాలన్నారు. ప్రధానంగా ఈ క్రింది నాలుగు రకాల మోసాల గురించి విద్యార్థులను అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్ట్-టైమ్ జాబ్ స్కామ్‌లో సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ చూపించి, మొదట చిన్న మొత్తాలను చెల్లించమని కోరి, చివరకు పెద్ద మొత్తంలో మోసం చేయడమేనన్నారు. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ అపరిచితులు ప్రభుత్వ అధికారులుగా లేదా పోలీసులగా ఫోన్ చేసి, లీగల్ చిక్కులు లేదా అరెస్ట్ పేరుతో బెదిరించి, డబ్బులు డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి విద్యార్థులకు నేటి తరుణంలో ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాల గురించి, అపరిచితుల నుండి వచ్చే లింకులు, కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత మరియు ఆర్థిక సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ పంచుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఐ. రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ మరియు పోలీస్ సిబ్బంది సైతం విద్యార్థులలో డిజిటల్ భద్రతపై మరింత అవగాహన కల్పించారు. ఎలాంటి మోసం జరిగినా ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

# ICFAI లా స్కూల్, హైదరాబాద్‌లో మోడల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (Model COP) 2025



హైదరాబాద్, నవంబర్ 6 (ప్రజాబలం ప్రతినిధి) – ICFAIలా స్కూల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మోడల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (Model COP) 2025 కార్యక్రమం నవంబర్ 7, 8, మరియు 9 తేదీల్లో IFHE క్యాంపస్‌లో జరుగనున్నది. గ్లోబల్ పర్యావరణ సవాళ్లపై లోతైన చర్చలకు, విధాన నిర్మాణానికి ఈ వేదిక ముఖ్య కేంద్రంగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను చేర్చుతూ, గౌరవనీయులు శ్రీ మర్రి శశిధర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా ఆరంభ కార్యక్రమాన్ని అలంకరించనున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిన ప్రజా నేతగా, ఆయన సాన్నిధ్యం పాల్గొనే విద్యార్థులకు ప్రేరణనిచ్చి, స్థిరత్వం మరియు వాతావరణ చర్యలపై చర్చలను మరింత సమృద్ధిగా చేస్తుంది. ఈ కీలక కార్యక్రమాన్ని ICFAI లా స్కూల్‌కు చెందిన సాక్షం సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ క్లబ్ మరియు GAIA - ఎన్విరాన్‌మెంటల్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఇది సంస్థ యొక్క అనుభవాధారిత విద్య మరియు సామాజిక బాధ్యత పట్ల నిబద్ధతను సూచిస్తోంది. మోడల్ COP, అంతర్జాతీయ చర్చా ప్రక్రియను అనుకరించే విధంగా రూపుదిద్దుకుంది. దీని ద్వారా భారతదేశంలోని వివిధ పాఠశాలలు, అండర్‌గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యాసంస్థల నుండి పాల్గొనే విద్యార్థులు వాతావరణ పాలన, పర్యావరణ న్యాయశాస్త్రం, గ్లోబల్ పాలసీ మేకింగ్ వంటి అంశాలపై సృజనాత్మకంగా, విమర్శనాత్మకంగా ఆలోచించే అవకాశం పొందుతారు. స్థిరమైన భవిష్యత్తు కోసం అవగాహన, చర్చ మరియు సామూహిక పరిష్కారాలను పెంపొందించే ప్రముఖ విద్యా వేదికగా ఇది నిలుస్తుంది. మోడల్ COP ప్రారంభోత్సవానికి ముందస్తుగా, విద్యార్థులు క్యాంపస్‌లో ఉత్సాహంగా ఫ్లాష్ మొబ్ నిర్వహించి, అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రీ–ఈవెంట్‌లు విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. ఈ సందర్భంగా హాజరైన గౌరవనీయులు: ప్రొ. రవి శేఖర్ రాజు డైరెక్టర్, ICFAI లా స్కూల్ ,ప్రొ. డా. Md. అక్బర్ ఖాన్ అసోసియేట్ డీన్ ,డా. ఏ. అరుణ్ కుమార్ అసిస్టెంట్ డీన్ (స్టూడెంట్ యాక్టివిటీస్) ,&. D.V.N. మూర్తి ఘాఈఆ క్లబ్ కో ఆర్డినేటర్ ,మిస్టర్ హృదయ్ తేజ సాక్షం క్లబ్ కో ఆర్డినేటర్ వారి హాజరు విద్యార్థులను ప్రేరేపించి, ప్రీ–COP కార్యక్రమాన్ని మరింత విశేషంగా నిలిపింది.

# అమ్మకు అక్షరమాల విజయవంతం చేయాలి

### జిల్లా వయోజన విద్యాధికారి అజ్మీరా పురుషోత్తం నాయక్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 6** విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమంను విజయవంతంగా అమలుకు చేయుట కొరకు మందమర్రి మండలంలోని ప్రతి గ్రామంలోని ఇద్దరు వి.ఓ లు మరియు ఒక వి.ఓ.యూ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నకు జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తం హాజరై మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించుట కొరకు వాలంటీర్ టీచర్స్ ను గుర్తించి ఉల్లాస్ ఆప్ లో నమోదు చేయడం జరిగిందని , నిరక్షరాస్యులను అక్షరాస్యులు గా చేసే ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి , ప్రతి గ్రామ సంఘం నుండి రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన కార్ప్ సి.ఆర్పీ లచే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని , ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఓ.బి, వి.ఓ.ఏ లు తమ గ్రామాలలో వాలంటీర్లను , నిరక్షరాస్యులను సమన్వయపరిచి అక్షర కేంద్రాల ద్వారా వారిని అక్షరాసులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అంకితభావంతో అందరూ కలిసి విజయవంతం చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలలో తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్, ఎంపీడీఓ రాజేశ్వర్, ఎం.ఈ.ఓ దత్త మూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత, ఏ.పి.ఎం చంద్ర శేఖర్, సుమలత, చైతన్య, సీఆర్పీ లు రజిత, స్వప్న, మహిళా సమాఖ్య ఆఫీసు సిబ్బంది మందమర్రి మండలంలోని అన్ని గ్రామాల నుండి ఓబీ, వి.ఓ.ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# బంటారం ప్రియాంక హెచ్పీ గ్యాస్ అద్భుతంగా సేవలు అందిస్తున్న గోపాల్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 6 ( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా: మర్పల్లి మోమిన్ పేట్ పరిసరాల ప్రాంతాల్లో అద్భుతంగా సేవలు అందిస్తున్న బంటారం ప్రియాంక హెచ్పీ గ్యాస్ అని ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు, గ్రామాల్లోకి వెళ్ళగానే స్పీకర్ ఆన్ చేసి హెచ్.పీ గ్యాస్ హెచ్పి గ్యాస్ అని అనౌన్స్మెంట్ చేస్తూ వీధి వీధి తిరిగి హెచ్.పీ గ్యాస్ సేవలు అందిస్తున్నారని తెలిపారు దూర ప్రాంతం నుంచి వచ్చినప్పటికిని ప్రజలకు మాత్రం సేవలు అందుబాటులో ఉండే అందిస్తున్నారని తెలిపారు ఇతర గ్యాస్లకంటే హెచ్.పీ గ్యాస్ జ్యోతి క్లియర్ గా ఉంటుందని నాణ్యతగా ఉంటుందని ప్రజల్లో మంచి విశ్వాసనీయమైన పేరు హెచ్.పీ గ్యాస్ ఉందని తెలిపారు

# జూబ్లీహిల్స్ బి ఆర్ ఎస్ గెలుపు పక్క





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి నవంబర్ 6 ( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి, మర్పల్లి మండల బి ఆర్ ఎస్ వైస్ ప్రెసిడెంట్ డి అశోక్ జూబ్లీహిల్స్ ప్రచార కార్యక్రమంలో టీం తో పాల్గొన్నారు, గెలుపులగెలుపు బి ఆర్ ఎస్ గెలుపు అనే నినాదాలతో టీం వర్క్ ప్రచార కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయని తెలిపారు, ఆర్ గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తూ ఆశ చూపి మోసం చేసిన ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ బి ఆర్ఎస్ గెలుపుగుణపాఠం కావాలని ప్రజలు అధిక సంఖ్యలో బి ఆర్ ఎస్ కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మళ్లీ సారే రావాలని ఇంటింటి ప్రచార కార్యక్రమాలు గెలుపుకు నాంది కావాలిఅని తెలిపారు ప్రచార కార్యక్రమంలో మ ర్పల్లి మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ డి అశోక్ మోయిజ్ విజయ్ టీం తో పాల్గొన్నట్టు తెలిపారు

## వేములవాడలో నిబంధనలు ఉల్లంఘించిన టిప్పర్ సీజ్.

## అడిషనల్ ఎస్పీ శేషాద్రి రెడ్డి.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా టిప్పర్ లో డస్ట్ తరలిస్తూ ఇతర వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఒక టిప్పర్ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగిందని, ఎం వి యాక్ట్ (మోటార్ వాహనాల చట్టం) ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. భారీ వాహనాలలో డస్ట్, గ్రావెల్,





కంకర తరలించే సందర్భాలలో అవి ప్రజలపై పడకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, లేనియెడల వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లను తొలగించండి.

## మండల సిపిఎం పార్టీ శాఖ విజ్ఞప్తి.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నుండి లక్ష్మీపురం, అయ్యోరుపల్లి, రామన్నపేట, రత్నంపేట గ్రామాలకు వెళ్లే రహదారి రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా పనికిరాని తుమ్మ చెట్లు, పిచ్చి చెట్లు రోడ్డుకు అనుకోని ఏపుగా పెరిగి ఉండడంవల్ల అట్టి రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు, ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో అయితే పెద్ద వాహనాలు వస్తే ద్విచక్ర వాహనదారులకు అట్టి రోడ్డుపై వెళ్లే పరిస్థితి లేకుండా ప్రమాదాలకు నిలయంగా మారే పరిస్థితిలు ఇక్కడ దాపురించినాయి. జిల్లా రోడ్ల భవనాల శాఖ అధికార యంత్రాంగం రోడ్డుకు ఇరువైపులా ఉన్న పనికిరాని చెట్లను తొలగించి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఈ సందర్భంగా బోయినపల్లి మండల సిపిఎం పార్టీ శాఖ తరపున ప్రభుత్వాధికార యంత్రంగానికి మరియు రోడ్లు భవనాల శాఖ అధికార యంత్రంగానికి పత్రిక ముఖంగా మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ విజ్ఞప్తి చేయడం జరిగింది.

# బీసీల 42 శాతం రిజర్వేషన్ల లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ.

## బీసీ పోరాటం ఏ వర్గాలకు వ్యతిరేకం కాదు.

## బిసి జేఏసీ నేత పొలాస నరేందర్.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసిన జీవో 9తో జారీ చేసిన ఎన్నికల షెడ్యూల్, ఎన్నికల నోటిఫికేషన్ చట్ట





విరుద్ధమని, రాజ్యాంగ విరుద్ధమని బీసీ వ్యతిరేకులు కోర్టులను ఆశ్రయించగా, హైకోర్టు జీవో 9 చెల్లదని , జీవో 9తో జారీ చేసిన ఎన్నికలు షెడ్యూల్ మరియు ఎన్నికల నోటిఫికేషన్ చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం, మొత్తం రిజర్వేషన్లు 50% మించకుండా, పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలని, ఎన్నికలు జరుపుటకు తేదీలను ప్రకటించాలని కోరుతూ కోర్టు ప్రభుత్వాన్ని కోరుతూ, మళ్లీ విచారణ ఈనెల 24 వాయిదా వేయడం జరిగిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ తో పాటు బీసీ జేఏసీ నేతలు కదారి రాములు, ఇల్లందుల వెంకటేష్, పిన్నింటి హనుమాన్లు తదితరులు తెలియజేశారు.

కోర్టు తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా, పారదర్శకంగా 42% రిజర్వేషన్లు అమలు చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, అంతవరకు ఎన్నికలు జరపాక కోర్టులతో న్యాయ పోరాటం , కేంద్రంతో రాజకీయ పోరాటం చేయాలని, పాత రిజర్వేషన్లతో, పార్టీ పర రిజర్వేషన్లతో ఎన్నికలు జరుపవద్దని ప్రభుత్వానికి బీసీ జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు.

బీసీలు చేస్తున్న ఈ పోరాటం ఏ వర్గాలకు వ్యతిరేకం కాదని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు మంత్రివర్గంలో, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి, ఉద్యోగ, ప్రమోషన్ల పరంగా రావాల్సిన కోటాకై, బీసీ సంక్షేమంకై రాష్ట్ర బడ్జెట్లో రావాల్సిన వాటాకై, పలు హక్కుల సాధనకై, ఆత్మ గౌరవం కై చేస్తున్న పోరాటమని, ఈ పోరాటానికి అన్ని వర్గాల వారు, అన్ని మతాలవారు రాజకీయాలకు అతీతంగా నేతలు, అఖిలపక్ష పార్టీలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, కోర్టులో మద్దతు తెలిపాలని బీసీ చేసి నేతలు విజ్ఞప్తి చేశారు.

# బాధ్యతగా వాహనాలు నడుపుదాం, రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం.

## ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలి.

## మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు.

## వాహనాల కండిషన్ ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి, పరిమితికి లోబడి వాహనాలు లోడు చేసుకోవాలి.

## వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రతినిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై ఆగాన కల్పించేందుకు వేములవాడ పట్టణ పరిధిలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్లో హెవీ వెహికల్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన నియమాలపై దిశా నిర్దేశం చేసిన వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి.




ఈ సందర్భంగా వేములవాడ అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరిస్తూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు నివారించాలని పిలుపునిచ్చారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, కండిషన్ లో లేని వాహనాలు నడపడం వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి చాలామంది తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా అతివేగంతో డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్ లోడ్, రాంగ్ రూట్లో ప్రయాణించడం, కండిషన్ లో లేనటువంటి వాహనాలు నడపడం లాంటి తప్పిదాలతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆమె తెలిపారు.



భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు దూర ప్రయాణం చేసే సందర్భాలలో సరియైన విశ్రాంతి తీసుకోవాలని దీని వల్ల ప్రమాదాలు నివారించవచ్చని, ప్రతి వాహనదారుడు వాహనాల కండిషన్ ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి. పరిమితికి లోబడి వాహనాలు లోడు చేసుకోవాలని, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియామాలను పాటించాలని, డ్రైవింగ్ అనేది వృత్తి మాత్రమే కాదని, అది అనేకమంది కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉందని గుర్తు చేశారు. ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం డ్రైవర్లతో రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రతిజ్ఞ చేపించారు.

అంతకుముందు వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండులో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా టిప్పర్ లో డస్ట్ తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది.

ఈ సమావేశంలో వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఎస్సైలు రామ్మోహన్, రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com